ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 22 జూలై 2025





వాణిజ్య పన్నుల శాఖ సీజ్ చేసిన లారీలు

గ్రానైట్ అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా, మండలస్థాయిల్లో టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు
- 16 లారీలను సీజ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ
- మరో రూ.40 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) అక్రమ మైనింగ్, గ్రానైట్ రవాణాపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన వరుస కథనాలపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నామని సోమవారం ఆయన వెల్లడించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సీటీవో, మైనింగ్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన జిల్లా స్థాయి కమిటీ మైనింగ్, అక్రమ రవాణాను కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎస్ఐ, రవాణ, వాణిజ్య పన్నులు, జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

నెలలో 35 గ్రానైట్ లారీలు స్వాధీనం

పల్నాడు జిల్లా నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. నెల రోజుల వ్యవధిలో 35 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రానైట్ మాఫియా లారీలను నిలుపుదల చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులను తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడింది. మూడు లారీలను సైతం జిల్లా సరిహద్దులను దాటించడం జరిగింది. గత నెలలో 17 లారీలను సీజ్ చేయగా ప్రభుత్వానికి పన్నులు, జరిమానాల రూపంలో రూ.42 లక్షలు ఆదాయం లభించింది. రెండు లారీలను నాలుగు రోజుల క్రితం, 14 లారీలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. లారీకి రూ.2.50 లక్షలు జరిమానా, పన్ను వసూలు చేసినా.. దాదాపు రూ.40 లక్షల ఆదాయం ప్రభుత్వానికి రానుంది.

టాస్క్ పోర్సు ఏర్పాటుతో ప్రభుత్వానికి నెలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది. గ్రానైట్ లారీకి సుమారు రూ.54 వేల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. నెలకు వందల సంఖ్యలో లారీల్లో గ్రానైట్ జీరో బిల్లులపై జిల్లా సరిహద్దులు దాటిపోతోంది. దీనిని అరికడితే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షమే.

గడువిస్తేనే.. ధీమా!

పంటల బీమా చెల్లింపు గడువు సమీపిస్తోంది. పంటలు సాగు చేయకమునుపే బీమా గడువు ముగియనుంది. మొన్నటి వరకు తీవ్ర వర్షా భావంతో ఏ పంటలు సాగు చేయాలో ఇంకా అన్నదాతలు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడిప్పుడే సాగు పనులు ప్రారంభమవుతున్నాయి. పత్తి, కంది, మిరప పంటలకు బీమా ప్రిమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. వరికి మాత్రం వచ్చే నెల 15వ తేదీ వరకు ఉంది. పంటల సాగు స్థితిని అంచనా వేయకుండానే పంటల బీమా గుడువును నిర్ణయించడం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఆగస్టు నెలాఖరు వరకు బీమా గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమా గడువు నెలాఖరు వరకే

- వరికి మాత్రమే ఆగస్టు 15 చివరి తేదీ
- పత్తికి వాతావరణ ఆధారిత బీమా



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పత్తి పంట సాగు చేయక ముందే ఈ నెల 15న బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. అయితే పల్నాడు జిల్లాలో పత్తి సాగుపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక పంపడంతో బీమా గడువును ఈ నెలాఖరుకు పొగించారు. పల్నాడులో పత్తి పంటను మాత్రమే వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద వరి, కంది, మిరప పంటలను ఎంపిక చేశారు. గడువు లోగా బీమా ప్రిమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పత్తి సరిగా సాగు చేయలేదు. ఇప్పుడిప్పుడే కురుస్తున్న వర్షాలతో పత్తి సాగుకు రైతులు సమాయత్తమవు తున్నారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా, ఇప్పటికి 31,420 ఎకరాల్లో అంటే 14 శాతం మాత్రమే పత్తి సాగు చేశారు. గుంటూరు జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా ఇప్పటికి 4,080 ఎకరాల్లో సాగు చేశారు. బాపట్ల జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 6,307 ఎకరాలు కాగా, 26 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం సాగైంది. వర్షాలు కొనసాగితే పత్తి సాగు చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ ఆధారిత బీమా (మిగతా 6వ పేజీలో)



దండుబాట రోడ్డులో ఎస్టీపీ ప్లాంట్‌కు ఎంపిక చేసిన స్థలం

మురుగుశుద్ధి.. లోపించిన చిత్తశుద్ధి!

- నెలాఖరుతో ముగుస్తున్న గడువు
- ఇప్పటికీ ప్రారంభం కాని ఎస్టీపీ పనులు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చీరాల పురపాలక సంఘం పరిధిలో ఎస్టీపీ ప్లాంట్(మురుగు నీటి శుద్ధి కేంద్రం) ఊసు అటకెక్కింది. ప్లాంట్ నిర్మాణంలోని సర్వే నంబరు 129/2లోని స్థలంపై స్థానికులు ఆక్షేపణ చేశారు. ఈ స్థలంలో గతంలోనే తమకు పట్టాలు ఇచ్చారని కోర్టును ఆశ్రయించారు. అలాగే స్ట్రయిట్ కట్ కాల్వ ఎత్తిపోతలకు సంబంధించి సుమారు 10 గ్రామాల రైతులు సుమారు 20 వేల ఎకరాల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పడితే పంట పొలాలు దెబ్బతింటాయని ఆందోళన బాట పట్టారు. 18 నెలల అగ్రిమెంట్‌తో రంగంలోకి దిగి న సింగం ప్రాజెక్టుకు ఈ నెలాఖరులోనే గడవు ముగియనుంది. ఎస్టీపీ ప్లాంట్‌పై కచ్చితమైన ఆలోచన లేని అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం మానేశారు.

నిధులు విడుదల.. స్థల సేకరణ.

చీరాల మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో రెండు లక్షల జనాభా ఉన్నారు. పట్టణంలోని వ్యర్థ జలాలు దండుబాట రోడ్డులోని మురుగు కాల్వ నుంచి ఈపూరు పాలెం స్ట్రయిట్ కట్ కాల్వలోకి చేరుతున్నాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు.. అమృత్ నిధి ద్వారా స్ట్రయిట్ కట్‌లో కలుస్తున్న మురుగును శుద్ధి చేసేందుకు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ రెండేళ్ల క్రితం ఎస్టీపీ ఏర్పాటుకు రూ.8.25 కోట్లు నిధులు మంజూరు చేయించింది. సర్వే నంబరు 129/1 మూడు సెంట్లు, 129/2 56 సెంట్లు, 143/3లో 38 సెంట్లు మొత్తంగా ఒకేచోట మూడు సర్వే నంబర్లలో 1.24 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

దశాబ్దాల జాప్యం..

లంకలకు శాపం



వరదకు కొట్టుకుపోయిన ఆనకట్ట

- 20 ఏళ్ళ క్రితం అరవింద వారధి వద్ద నదికి గండి
- కొద్దిపాటి వరదకే కరకట్టను తాకుతున్న కృష్ణమ్మ
- పంటలు నష్టపోతున్నరైతులు

కొల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండలం, పెసర్లంక అరవింద వారధి ఎగువన సుమారు 20 ఏళ్ల క్రితం కృష్ణా నది కరకట్టకు గండి పడింది. వరదలు సమయంలో ఆ గండి క్రమేపీ కోతకు గురై పెద్దదైంది. దీని కారణంగా పెసర్లంక గ్రామస్తులు వరదలు సమయంలో తమ పంటలను కోల్పోవాల్సి వస్తుండటంతో, గండి పూడ్చాలని పలుమార్లు లిఖిత పూర్వకంగా అర్జీలు అందించారు. ఆయా అర్జీలను అందుకున్న అధికారులు వరదల సమయంలో ఉన్నతాధికారులకు గండి గురించి వివరించడం, ఉన్నత స్థాయి అధికారులు గండి పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని చెప్పడం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద వచ్చే ముందు ఇసుక బస్తాలతో గండి వద్ద పనులు చేపట్టి మమ అనిపిస్తున్నారు. వరద వచ్చిన వెంటనే ఆ ఉధృతికి ఆర్‌సి సిబ్బంది వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో పాటు చుట్టుపక్కల భూములు కోతకు గురై గండి అంత అంతకు పెద్దదిగా అవుతూ వచ్చింది. 2024లో కృష్ణానదికి వరద హెచ్చరికలు ప్రకటించిన జిల్లా అధికారులకు గ్రామస్తులు గండి విషయాన్ని వారి దృష్టికి తీసుకు వెళ్లగా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు గండిని పరిశీలించారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి (మిగతా 6వ పేజీలో)

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

- అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజనీర్లతో కలిసి మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందులున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు, ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శుల కోసం 25 బంగ్లాలు, సెక్రటరీల కోసం 90 బంగ్లాలు, మంత్రుల కోసం 35 బంగ్లాలు, జడ్జిల కొరకు 36 బంగ్లాలు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల్లో టైప్-1 అధికారుల కోసం 4 టవర్లలో 384 ఫ్లాట్లు, టైప్- 2 అధికారుల కోసం 4 టవర్లలో 336 ఫ్లాట్లు, గ్రూప్- డీ ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలియ జేశారు. అమరావతిలోని హ్యాపీనెస్ట్ 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. వాటి పైలింగ్ వర్కులు వేగంగా (మిగతా 6వ పేజీలో)



అధికారుల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తిప్పుకోవద్దు.. సత్వర పరిష్కారం చూపండి

పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే బాధితులను తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. సమస్యలు పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి 191 మంది అర్జీలు అందజేశారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కారమార్గం చూపారు. కొన్నిటిని ఆయా శాఖల అధికారులకు కేటాయించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థ పరిధిలోకి దస్త్రాలన్నిటిని తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వారంలో లక్ష ఫైల్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పీ4 అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. పరిశీలనకు వెళ్లే ముందు సమయంలో గ్రామ కమిటీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల నీడ్ బెస్ట్ సర్వే పరిశీలించాలని సూచించారు. సూర్యఘర్, స్వచ్ఛతహి కార్యక్రమాలు పరిశీలించాలన్నారు. గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీల నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో

పలు రైళ్ల రద్దు

- కొన్ని పాక్షిక్ష రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

కడలి గర్భశోకం



- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు

సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలి

- ప్రముఖ సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి

8

ఎంఈవోలకూ..

ముఖ హాజరు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

6



తటాకాన్ని తలపిస్తున్న చీరాల - బాపట్ల రహదారి

జోరు వాన

- వరి, వాణిజ్య పంటలకు ఊపిరి పోసిన వరుణుడు
- లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య
- డ్రెయిన్‌లలో పూడిక అడ్డుపడి మునుగుతున్న చేలు

బాపట్ల, జూలై 21, (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు మండిన ఎండలు సెగరేపితే మనుషులతోపాటు పైర్లూ మాడిపోయాయి. వరి నారుమళ్ల, వెదసాగు వరి చివర్ల ఎండి కళావిహీనంగా మారిపోతే, ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో వాతావరణం చల్లబడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో వరుణుడు కుమ్మరించేశాడు. వర్షంతో పట్టణాల్లో రోడ్లన్నీ జలమయమైపోతే, చేలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. తెనాలిలో మాత్రం తాజాగా మురుగు కాల్వల పూడిక తీయటంతో చిన్న వానకే మోకాళ్లలోతు నీటితో నిండిపోయే బోస్‌రోడ్‌పై చుక్కనీరు కూడా కనిపించలేదు. రోడ్లవెంట ఆక్రమణలుకూడా తీసేసి, రోడ్డుకంటే అంచులు ఎత్తు లేకుండా కాంక్రీట్ చేయటంతో వర్షపునీరు కాల్వలోకి వెళ్లిపోవటంతో ముంపు సమస్య లేకుండా పోయింది. అయితే లోతట్టు ప్రాంతాలు మాత్రం వరద ముంపును తలపించాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్‌కు ఊపిరి పోసినట్టయింది. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటే, 2025-26 ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటికే లక్షన్నర ఎకరాలకుపైగా వెదపద్ధతిలో సాగు మొదలుపెట్టేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే ఖరీఫ్ సాగు కింద వరి నారుమళ్ల బోర్ల కింద పోస్తే, చాలావరకు వెద పద్ధతిలో విత్తనాలు చల్లేశారు. అయితే నిన్నటి వరకు ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో పైరు చివర్ల మాడిపోయి, ఎండిపోయిన పరిస్థితి. అయితే వర్షం పడటంతో పైరుకు జీవం పోసినట్టే. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి వదలకుండా వర్షం పడుతుండటంతో వెద పద్ధతిలో ఇటీవల విత్తనాలు చల్లిన చేలల్లో మాత్రం చిన్న మొలకలను ముంచేశాయి. మొక్క కనిపించనంతగా వర్షం నీరు ముంచేసింది. ప్రస్తుతం పైరుకు ఇబ్బంది లేకున్నా, ఇదే తరహాలో మరో రెండు రోజులు వర్షం పడితే కొత్తగా విత్తనాలు చల్లిన చేలకు మాత్రం ఎంతో కొంత నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు. మరో పక్క లంక గ్రామాల్లోని అరటి, పసుపు, కంద, తమలపాకు వంటి వాణిజ్య పంటలకు వర్షం మంచిమేలే చేసింది. నిన్నటి వరకు ఎండ వేడికారణంగా నీటి తడులు పెట్టటానికి రోజులు పడితే, ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. వెద పద్ధతిలో నాటు వేసిన వరికి కూడా ఎకరా విస్తీర్ణంలో పైరుకు నీటి తడి పెట్టటానికి మోటార్‌లతో రెండు రోజులకు మించి సమయం పట్టింది. అటు వాణిజ్య పంటలకు కూడా ఇదే పరిస్థితి. ఎకరా నేల తడవటానికి రోజున్నర సమయం పట్టిన పరిస్థితి. వర్షం పడటంతో నీటి తడుల కష్టాలకు తెరపడింది. వదలకుండా పడుతున్న వర్షం కారణంగా డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. భట్టిప్రోలు, రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లలో చాలాచోట్ల గుర్రపు డెక్క పేరుకుపోవటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల గుర్రపు డెక్కపై కలుపు మందులు పిచికారి చేయటంతో అవి ఎండిపోయినా, ప్రవాహానికి అడ్డుగానే ఉండిపోయాయి. అయితే ప్రవాహం వేగం ఉన్న డ్రెయిన్‌లలో మాత్రం మొత్తం కిందికి కొట్టుకుపోతుంటే, చిన్న డ్రెయిన్‌లలో ఆటంకాలు ఏర్పడటంతో నీరు కిందికి పోలేని పరిస్థితి. దీంతో చేలల్లోకి వర్షపు నీరు చేరిపోతోంది. అయితే పైర్లు కేవలం 30 శాతం మాత్రమే ఉండటంతో నష్టం పెద్దగాలేదు.

చీరాల లోని పలు వీధులు జలమయం అయ్యాయి. బాపట్ల -చీరాల ప్రధాన రహదారితో పాటు ఈపూరుపాలెం, జాండ్రపేట సెంటర్లలో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షం ధాటికి బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌తో తటాకాన్ని తలపించింది. పర్చూరులో ఈదురుగాలులు ధాటికి కరెంటు తీగలు తెగిపడడంతో దాదాపు రెండు గంటల పాటు కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. వీధులన్నీ జలమయం కాగా రాకపోకలకు అంతరాయం కలిగింది. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన వర్షాలు మెట్ట ప్రాంతాలయిన నువ్వు, మొక్కజొన్న పంటలకు ఊపిరి పోశాయి. రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మరో మూడు రోజుల పాటు ఇదేరీతిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బర్లీ పొగాకు నిల్వలను రైతులు ఇళ్ల వద్దే పట్టాలతో జాగ్రత్త చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ తేమ నిబంధనలు పాటించాలని నిక్కచ్చిగా చెబుతున్న తరుణంలో బేళ్ల కిందకు నీళ్లు చేరడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



బాపట్ల : బీటీ రోడ్డుపై వర్షపు నీరు



అమృతలూరులో అసంపూర్తిగా గిడ్డంగి

అసంపూర్తిగా.. గిడ్డంగులు

అమృతలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాల అవసరాల కోసం ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఆయా సొసైటీల పరిధిలో గిడ్డంగులు నిర్మాణం చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే ఎరువులను స్టాకు ఉంచడం కోసం ఈ గిడ్డంగులు నిర్మాణం చేపట్టినట్లు అప్పటి అధికారులు చెప్పారు. దీనిలో భాగంగా అమృతలూరు మండల పరిధిలోని అమృతలూరు, ఇంటూరు, పెదపూడి, బోడపాడు గ్రామాల్లో వీటి నిర్మాణాలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రాలకు నాబార్డు రుణం మంజూరుకు అవకాశం లేకపోవడంతో సహకార సంఘాలకు ప్రభుత్వం 33 సంవత్సరాలు లీజు ప్రాతిపదికన భూమి కేటాయించింది. ఈ భూమిలో గిడ్డంగులు నిర్మించాలని సహకార సంఘాలను ఆదేశించింది. ఈ భూమిలో గిడ్డంగి నిర్మాణానికి నాబార్డు నుండి 4 శాతం వడ్డీతో సహకార సంఘాలకు 45 లక్షల రూపాయలు రుణం మంజూరును ప్రభుత్వం చేయించింది. వీటి నిర్మాణానికి రాష్ట్ర స్థాయిలో అనుమతులు పొందిన గుత్తేదారుడు చేసిన పని వరకు బిల్లులు చేసుకుని పత్తా లేకుండా పోయాడు. అసంపూర్తిగా ఉన్న గిడ్డంగులతో సహకార సంఘాలపై ఆర్థికంగా అదనపు భారం పడటం మినహా మరే ప్రయోజనం లేకుండా పోయింది. బోడపాడు సహకార సంఘం పరిధిలో నిర్మాణం పూర్తికాగా మిగిలిన చోట్ల వీటి గురించి పట్టించుకునేవాడే లేకుండా పోయారు.

ఇద్దరు మార్కెటింగ్ సూపర్‌వైజర్ల ఇంక్రిమెంట్ల కోత

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గతంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న నల్లపాడు గొర్రెలమండిలో సెస్సు వసూళ్లలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకొంది. 2019 డిసెంబరు 20న మండిలో ఆకస్మిక తనిఖీలను అధికారులు నిర్వహించారు. ఆ సమయంలో భారీ వ్యత్యాసాలు కనిపించాయి. దీంతో సూపర్‌వైజర్లు ఎస్.అంజి బాబు (ప్రస్తుతం తెనాలి ఏఎంసీ), కె. రామకృష్ణ(ప్రస్తుతం గురజాల ఏఎంసీ)లను బాధ్యులుగా గుర్తిస్తూ అభియోగాలు నమోదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఇద్దరికి ఒక యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌ని క్యుములేటివ్ ఎఫెక్ట్‌తో నిలిపేస్తూ చర్య తీసుకొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'విజ్ఞాన్స్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

గుంటూరు (విద్య)జూలై 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. విజ్ఞాన్ టీబీఐ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్‌ల ఆర్థిక సౌజన్యంతో 5 రోజుల పాటు "ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్"పై ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అస్పైర్ టీబీఐ సీఈవో డాక్టర్ బీఎస్ రామక్రిష్ణ మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్ ప్రాముఖ్యతను, "క్రియేటివిటీ అండ్ ఐడియా జనరేషన్" గురించి వివరించారు. మానసిక అడ్డంకులను ఎలా అధిగమించాలో, కొత్త ఆలోచనలను ఎలా కల్పించాలో అధ్యాపకులకు వివరించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అశోక ఇన్నోవేషన్ కోచ్ డాక్టర్ రవి చంద్ర రాజు మాట్లాడుతూ సమస్యలపై విద్యార్థుల్లో దృష్టికోణాన్ని పెంపొందించేలా అధ్యాపకులు మారాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.30వేల నగదు, బంగారు, వెండి వస్తువుల చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటూ తరచూ స్వంత గ్రామానికి వచ్చి వెళుతూ ఉండే ఓ వృద్ధురాలి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు నగదు, బంగారు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. యడ్లపాడు మండలం ఖైదవోలు గ్రామానికి చెందిన బండారు వరలక్ష్మి హైదరాబాద్‌లోని కుమారుడి వద్ద నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఇరుగు పొరుగువారు ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి హైదరాబాద్‌లోని వరలక్ష్మికి ఫోన్‌చేసి సమాచారం అందిం చారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా నేలపై పడి ఉనాయి.. బీరువాలో దాచిన రూ.30వేల నగదుతోపాటు 4 గ్రాముల బంగారు, 40 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజిని పోలీసులు పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించిన దుండగుడు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులుగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ వెల్లడించారు.

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
- విధిగా రోజుకు ఒక పాఠశాల తనిఖీ
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సత్తెనపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ఉదయం 9 గంటలకు ముఖ హాజరు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఇక ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లి రావచ్చనే వారికి చెక్ పడనుంది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఎంఆర్‌సీలకు వెళ్లి ఎంఈవోలు ఆన్‌లైన్‌లో ముఖ హాజరు వేయాలి. ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలి. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాలు, హెచ్‌ఎంలు, టీచర్ల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించటానికి ఎంఈవోలను ప్రభుత్వం నియమించింది. గత వైసీపీ పాలనలో ప్రతి మండలానికి అదనంగా ఎంఈవో-2ను నియమించారు. ఐనా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. ఇద్దరు ఎంఈవోలు ఉండటంతో అనేక మండలాల్లో ఆధిపత్య పోరు మొదలైంది. ఇంకో వైపు చాలా మంది ఎంఈవోలు స్థానికంగా నివాసం ఉండకుండా జిల్లా డివిజన్ కేంద్రాల్లోనే నివాసం ఉంటున్నారు. దీంతో పని వేళలు పాటించటం లేదు. ఎప్పుడో వెళ్లి హాజరు వేసుకుంటున్నారు. కొందరైతే జిల్లా కేంద్రంలో ఉంటూ అక్కడి నుంచే ఏదో ఒక కారణం చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎంఈవోలతో పాటు ఎంఆర్‌సీలలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కింది స్థాయి సిబ్బంది కూడా 9 గంటలకే ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

హాజరు తనిఖీలపై రోజూ నివేదిక

తోచిన కారణాలు చెప్పి తప్పించు కోవటానికి అవకాశం లేకుండా ఎంఈవోల మెడకు కమిషనర్ కత్తి బిగించారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9:30 గంటలకు ఎంత మంది ఎంఈవోలు హాజరు వేసింది జిల్లా విద్యాశాఖ ప్రతి రోజు కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. గతంలో కొందరు ఎంఈవోలు డివిజన్, జిల్లా కేంద్రాల నుంచి ఎప్పుడో బయలు దేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి హాజరైనట్టు నమోదు చేసుకొనే వారు. ఇప్పుడలా కాకుండా ఎంఈవోలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎంఆర్‌సీకి వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది. పాఠశాలలకు వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది.

దశాబ్దాల జాప్యం.. లంకలకు శాపం

(5వ పేజీ తరువాయి)



గోడ నిర్మాణం కోసం గండి పరిశీలనకు వచ్చిన అధికారుల బృందం

రావడం, నక్కా ఆనందబాబు శాసన సభ్యునిగా ఎన్నిక కావడం, వరద హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంత గ్రామాల వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచనలు చేస్తూ లంక గ్రామాల్లో పర్యటించారు. పెసర్లంకలో పర్యటిస్తుండగా గండి విషయాన్ని గురించి గ్రామస్తులు ప్రస్తావించగా ఆయన పరిశీలించి జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి తీసుకు వెళ్లగా తాత్కాలిక మరమ్మతులు చేయించి వరద నీరును గండి ద్వారా వెళ్లకుండా నిరోధించే పనులు చేపట్టాలని సూచించారు. వారి ఆదేశాల మేరకు ఇసుక, బసుకతో గండి ప్రదేశంలో భారీ స్థాయిలో అనకట్ట పోసి ఇసుక బస్తాలను వేశారు. అయితే ఎవరూ ఊహించని స్థాయిలో కృష్ణానదికి భారీ వరద పోటెత్తడంతో పోసిన ఆనకట్ట వరద ఉధృతికి కొట్టుకుపోయింది. వరద తగ్గిన తరువాత ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తారని సీఎం కార్యాలయ అధికారులు ఎమ్మెల్యే ఆనందబాబుకు సమాచారం ఇవ్వడంతో ముఖ్యమంత్రికి పెసర్లంక గండి ప్రదేశాన్ని తెలియజేసి, అక్కడ భవిష్యత్‌లో వరదలు పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలు ముంపబారిన పడకుండా ఉండే విధంగా గండి ప్రదేశంలో భారీ గోడ నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరేందుకు సిద్ధమయ్యారు. అయితే అనుకోని కారణాల వల్ల మూడు సార్లు ముఖ్యమంత్రి పర్యటన రద్దు కావడంతో ఈ విషయం ముఖ్యమంత్రికి చేరలేదు. గండి గురించి బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యే సూచనల మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపడంతో సంబంధిత శాఖ అధికారుల బృందం కొన్ని నెలల క్రితం పెసర్లంక గండిని సందర్శించి గోడ నిర్మాణానికి కొలతలు వేసుకుని నిర్మాణ వ్యయ అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

అయితే ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడం నదీ పరివాహక ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలు కురవడతో జలాశయాలు నిండుతున్నాయి. ఆగస్టు నెలలో మళ్లీ కృష్ణానదికి వరదలు వచ్చే అవకాశాలు ఉండటంతో లంక గ్రామాల ప్రజలు గండి ప్రాంత ప్రదేశంలో గోడ నిర్మాణం చేసి ఉంటే 6 లక్షల నుంచి 7 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చిన ఆ ప్రవాహం నదిలోనే వెళుతుందని చెబుతున్నారు. కృష్ణానది 3 నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిన కొల్లూరు కరకట్ట దిగువున రోడ్డుపై వరద ప్రవాహం పొటెత్తుతుంది. దీంతో 14 లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ఆస్కారం ఉంది. పాలకులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని గండి వద్ద నిర్మాణం చేపట్టి పంటలతో పాటు రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయని ఆయన అన్నారు. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెలాఖరునాటికి 90 శాతం మ్యాన్ పవర్‌తో పనులు జరిపిస్తామని ఆయన చెప్పారు.

● డిసెంబర్ నాటికి మెజారిటీ సంస్థల నిర్మాణాలు ప్రారంభం

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పిన ఆయన, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు.

గుర్రపు డెక్క చుట్టుకుని పశువుల మృతి



రేపల్లె డ్రెయిన్‌లో పడి మృతి చెందిన పాడి పశువు

వేమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుమర్రు ఎస్టీ కాలనీకి చెందిన చౌటూరి చినపిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు సోమవారం రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లో గుర్రపు డెక్కకు చుట్టుకుపోయి మృతి చెందాయి. పోతుమర్రు, చంపాడు గ్రామాల మధ్యలో ఉన్న ప్రధానమైన మురుగు కాల్వలో సంబంధిత అధికారులు గుర్రపుడెక్కను తొలగించలేదు. పిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు కాల్వలో దిగాయి. నాలుగు పశువులు కనపడని కారణంగా గ్రామస్తులు కాల్వలో దిగి గాలింపు ప్రారంభించారు. మూడు పశువులు మృతి చెంది గుర్రపు డెక్కకు చిక్కుకుపోయిన ఉన్నట్లు గుర్తించారు. మరో పాడి పశువు కనబడటం లేదు. అప్పు చేసి పాడి పశువులపై జీవనం సాగిస్తున్న పిచ్చయ్య తన జీవనోపాధిని కోల్పోయానని విలపిస్తున్నాడు. నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తనకు రూ.2.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నాడు. ప్రభుత్వం ద్వారా తనకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు. బ్యాంకు ద్వారా చేసిన అప్పు చేసి రద్దు చేయించాలని విన్నవించుకుంటున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌బీ బోగీలతో లక్నో ఎక్స్‌ప్రెస్ అప్‌గ్రేడ్

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు న్యూగుంటూరు మీదగా రాకపోకలు సాగించనున్న లక్నో ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో రైల్వే శాఖ అప్‌గ్రేడ్ చేసింది. ఈ నెల 26వ తేదీ నుంచి నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో ఎక్స్‌ప్రెస్‌ని, 28వ తేదీ నుంచి లక్నో - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడపనున్నట్లు రైల్వే శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని వలన ఏసీ టూటైర్ ఒకటి, ఏసీ త్రీటైర్ ఎనిమిది, స్లీపర్‌క్లాస్ నాలుగు, జనరల్ సెకండ్ క్లాస్ ఒకటి, ఎస్ఎల్ఆర్ ఒకటి బోగీలతో ఈ రెండు రైళ్లు ప్రయాణిస్తాయి.

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి మరో ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీ

నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లను శాశ్వతంగా మరో అదనపు ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీని జోడించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. నంబరు. 12795 విజయవాడ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 26, నంబరు. 12796 లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి అదనపు బోగీలు జోడించి నడపనున్నట్లు పేర్కొన్నది.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

రూ.10.37 లక్షల విలువ గల చోరీ సొత్తు సీజ్ చేసిన పోలీసులు



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టిన బాపట్ల సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్లరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, గుంటూరుజిల్లాలలో రాత్రిపూట వరస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని బాపట్ల సీసీఎస్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను జిల్లా సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ సీసీఎస్ పోలీసుస్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం జగదీష్ అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రారంభించాడు. బాపట్లజిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను సవాల్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి పర్యవేక్షణలో సీసీఎస్ పోలీసుబృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడు బెజ్జం జగదీష్‌ను పర్చూరు, చిలకలూరిపేట వెళ్ళేరోడ్డులోని వైజంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు ఎల్‌ఈడీ టీవీలు, కంప్యూటర్, ఒకప్రింటర్, బంగారుచైను, సెల్‌ఫోన్‌లు, నల్లపూసల గొలుసు మొత్తంగా రూ. 10లక్షల 37వేల విలువగల రికవరి సొత్తును స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందని తెలిపారు. దొంగతనాల కేసు చేధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ బాపట్లఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య సీసీఎస్ ఎస్సై రవిప్రకాష్, బి.రాంబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఇంటి నిర్మాణాల పేరుతో మోసం

తెనాలిలో కాంట్రాక్టర్ అరెస్టు



కాంట్రాక్టర్‌ను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తీసుకువెళుతున్న ఎస్‌ఐ ఆనంద్

తెనాలి రూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాల పేరుతో నగదు తీసుకుని లబ్ధిదారులకు నిర్మాణ పనులు పూర్తిచేయకుండా తప్పించుకు తిరుగుతున్న కాంట్రాక్టర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం తెనాలి మం డలంలోని పెదరావూరులో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా గత ప్రభుత్వంలో నివేశన స్థలాలను లబ్ధిదారులకు అందించారు. వాటిల్లో ఇంటి నిర్మాణాలకు గానూ ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.1,80,000 వంతున మంజూరు చేసింది. దీంతో ఇంటి నిర్మాణానికి కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టి అప్పగిస్తామని తెనాలి మారీసుపేటకు చెందిన ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ కాంట్రాక్టర్ అండ్ ఏజెంట్ పున్నారావు పలువురు లబ్ధిదారులను నమ్మబలికారు. నగదుతీసుకుని అగ్రిమెంట్ చేసి సకాలంలో ఇంటినిర్మాణ పనులు పూర్తిచేసి వారికి అప్పగించలేదు. నిర్మా ణ పనులపై లబ్ధిదారులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పకుండా నగదు తిరిగి చెల్లించకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు లబ్ధిదారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాంట్రాక్టర్‌పై గతంలో బుర్రిపాలెం, నేలపాడు గ్రామాల లేఅవుట్లకు సంబంధించి మోసం చేశాడన్న ఫి ర్యాదుతో న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నరసరావుపేట సబ్‌జైల్లో ఉన్న నిందితుడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి తెనాలి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. తిరిగి నరసరావుపేట జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ ఆనంద్ పేర్కొన్నారు. రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

అరాచకాలను చూడలేకనే వైసీపీకి బుద్ధి చెప్పారు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



వర్షంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చేసిన అరాచకాలు, విధ్వంసం, దుర్మార్గపు పాలనను చూడలేకనే విసిగి పోయిన ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయపాలెం, బుక్కాపురం, ఎండుగుంపాలెం గ్రామాల్లో జోరు వానలోనూ పుల్లారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎండుగుంపాలెంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులు పండించిన సుబాబుల్ కర్రను అమ్ముకోనివ్వకుండా వేధించారన్నారు. అలాంటి వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళానని, ఈ క్రమంలోనే పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సాగు నీటి సంఘాల చైర్మన్ నెల్లూరి రామారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరి ముల్లా, నాయకులు ఎన్ సదాశివరావు, బీ సత్యనారాయణ, జే మదన్, ఎన్ హరిబాబు, కే రమణ, డీ శ్రీనివాసరావు, జీ రమేష్, సుమన్, సింగయ్య, జయప్ర సాదు, విజయ సాయి, రాయన్న, ఇన్నయ్య, సుభానీ, రాఘవయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో ఆరోగ్యాలు నాశనం చేసిన వైసీపీ

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి డబ్బుతో పాటు వారి ఆరోగ్యాన్ని నాశనం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఐదేళ్లపాటు ప్రజలను జలగల్లా పట్టి పీడించి మద్యం,మైనింగ్, ఇళ్ళ స్థలాలు స్కామ్‌లకు పాల్పడ్డారని విమర్శించారు. అప్పుడు టీడీపీ ప్రతిపక్ష పార్టీగా పోరాడితే అక్రమ కేసులతో అణిచివేయాలని చూశారన్నారు. సిట్ దర్యాప్తుతో మద్యం కుంభకోణంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు అతని వెనకున్న మాజీ సీఎం జగన్‌కు శిక్షపడే రోజులు తొందరలోనే వస్తాయన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు గోపి (ఫైల్‌ఫొటో)

ఈపూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని భద్రుపాలెం సమీపంలో సోమవారం జరిగింది. రొంపిచర్ల మండలం ఆరేపల్లికి చెందిన గుడిపాటి గోపి(22) మోటార్ బైక్‌పై భద్రుపాలెం వెళ్తుండగా ఎదురుగా ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో గోపి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పోలీసులు అంబులెన్స్‌లో ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సరావుపేటకు తీసుకువెళ్ళారు. చికిత్స పొందుతూ గోపి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గోపి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గుడిపాటి సింగరయ్యకోటేశ్వరమ్మలకు ఐదుగురు కుమార్తెల తరువాత గోపి పుట్టాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 21, (ఆంధ్రజ్యోతి), చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో దిగువ కోర్టు విధించిన 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షలు ఫిర్యాదుకి నష్టపరిహారంగా చెల్లించేలా విధించిన శిక్షను యథాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన నిందితుడు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు వద్ద 2013 ఫిబ్రవరి 27న రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 మే 5న రూ.25 లక్షల చెక్కును ఇచ్చాడు. నాగేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వేసుకోగా అది చెల్లలేదు. ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువడంతో 2021 జనవరి 20న దిగువ కోర్టు కోర్టు పై విధంగా తీర్పును వెలువరించింది. నిందితుడు శ్రీనివాసరావు జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథాతథాంగా ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

గడువిస్తేనే..ధీమా!

(5వ పేజీ తరువాయి)

పత్తి ఎకరాకు రూ.1,900 ప్రిమియం ఈ నెల 31వ తేదీ కల్లా చెల్లించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు బీమా పొగించడంతో పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు సూచించారు.

సాగు మొదలు కాని కంది, మిరప

కంది, మిరప పంటలు సాగు చేయలేదు. ఆయా పంటల సాగుపై రైతులకు ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెల మొదటి వారంలో సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయనున్నారు. పల్నాడులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సాగు చేపట్టలేదని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వర్షాలు కొనసాగితే కందిసాగు ఈ నెలాఖరుకు ప్రారంభమయ్యే అవకాశాలు న్నాయి. అగస్టు 15 తర్వాతే మిరప సాగు చేసే అవకాశాలున్నాయి. అయితే.. అప్పటి వరకు బీమా సౌకర్యం లేదు. పంటలు సాగు చేయక ముందే బీమా పథకాల గడువు ముగుస్తుండటం గమనార్హం. జిల్లా యూనిట్‌గా పంటల బీమాను అమలు చేస్తే పంటలు సాగు చేశాక రైతులు బీమా ప్రిమియం చెల్లించే అవకాశం ఉంటుంది. బీమా గడువును ఆగస్టు ఆఖరు వరకు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే బీమా సౌకర్యాన్ని వారు కోల్పోయినట్లే.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

44,971 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 47,858 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,971 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,252 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9500	12500
273	----	----	నెంబరు. 5	10000	13600
341	10000	13600	273	9800	12800
4884	----	---	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు సచివాలయాల్లో పీ-4సర్వే కార్యక్రమం

పిట్టలవానిపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనకట్టవారి పాలెం, కోమలి గ్రామసచివాలయాల్లో మంగళవారం పీ-4సర్వే కార్యక్రమం జరుగుతుందని పిట్టలవానిపాలెం ఇన్‌చార్జి మండలపరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఎలీషాబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి అమరావతికి చెందిన ప్రత్యేక టీమ్ ఆయా సచివాలయాల్లో జరిగే పీ-4 కార్యక్రమం పనితీరును పరిశీలిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

నేడు ప్రకాశం స్మారక ఉపన్యాసం

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం స్మారక ఉపన్యాసం ఈనెల 23వ తేదీ సాయంత్రం 4గంటలకు బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయం నందు జరుగుతుందని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఫోరంఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

చెరుకుపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పదోన్నతిపై బదిలీ అయ్యారు. చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శి విజయబాబు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా గుళ్ళపల్లి పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, పల్నాడుజిల్లా బెల్లంకొండ మండలం డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలి

రేపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్లకు మినీవర్కర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. సోమవారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్‌ను మాత్రమే నిర్వహించాలి. ఐసీడీఎస్ లక్ష్యం పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆహారం, ఆరోగ్యం విద్య అందించాలి. ఫేస్‌యాప్ ద్వారా ఈ పనులన్నీ చేయాలంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. అనంతరం సీడీపీవోను చిత్రకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు రత్నకుమారి, కృష్ణకుమారి, అరుణ, శ్రీలత, సీహెచ్‌మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రెడ్‌క్రాస్ చేయూత

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చీరాల వాస్తవ్యులు సాయిప్రభాకర్‌కు బాపట్ల రెడ్‌క్రాస్ బృందం సోమవారం ఆర్థికసాయం అందించింది. కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో ప్రభాకర్‌కు నెలసరి మందులకు సరిపోను ఆర్థిక సహకారం అందజేశారు.

పుట్టలమ్మకి సారె సమర్పణ

కర్లపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాజలి గ్రామంలో ఉన్న శ్రీపుట్టలమ్మతల్లికి ఆషాఢమాసం సారె సమర్పించారు. సోమవారం గ్రామ మహిళలు పెద్దఎత్తున ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సారె సమర్పించటానికి వెళ్లారు. పూజలు నిర్వహించి సారె సమర్పించారు.

వైసీపీ నాయకుడు మోదుగులకు ఘన సన్మానం

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మోదుగుల శ్రీరామిరెడ్డి విద్యాసంస్థల అధినేత మోదుగుల బసవపున్నారెడ్డిని సోమవారం ఆయన కార్యాలయం నందు పార్టీశ్రేణులు పెద్దఎత్తున కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సత్కరించారు. కేక్‌లు కట్ చేసి అభినందనలు తెలిపారు. వైసీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు మోదుగుల నాయకత్వంలో తామంతా కలిసి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీఅధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, శ్రీనివాసరెడ్డి,, మరుప్రోలువారిపాలెం గ్రామపెద్దలు, అల్లూరు నుండి రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, బేతపూడి నుంచి ఆసోది శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి, పేరలికొత్తపాలెం నుండి నంగు గోవర్దనరెడ్డి, కోమలిపెద్దలు బసివి రెడ్డి, వీరారెడ్డి, విష్ణురెడ్డి తదితరులు పాల్గొని మోదుగుల బసవపున్నారెడ్డికి అభినందనలు తెలిపారు.

పేదలకు ఆర్థిక చేయూత

కర్లపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజి అన్నారు. సోమవారం ఛత్రపతి శివాజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం కాలవ కట్టమీద నివసిస్తున్న పేద కుటుంబానికి 10కేజీల బియ్యం అందించామన్నారు. బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, అనారోగ్యంగా ఉన్నవారికి ఆర్థిక చేయూత అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెనుమెత్స చిన్న, పెనుమెత్స నరసింహమూర్తిరాజు, దేవేందర్‌రాజు, మంతెన నారాయణరాజు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ప్రచారం

బాపట్ల రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య రాష్ట్ర ప్రచార కార్యక్రమాలు మూడురోజులు పాటు నిర్వహిస్తామని జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. సోమవారం బాపట్ల ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

సంక్షేమ దృక్పథంతో పేదలకు సాయం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- 27మందికి రూ.19.46లక్షల సీఎం సహాయనిధి చెక్కులు



సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పార్టీశ్రేణులు

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ దృక్పథానికి నిదర్శనంగా నియోజకవర్గంలోని 27 మందికి రూ.19,46,083ల చెక్కులను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబపరిస్థితి, ఆరోగ్యం గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికస్థోమత లేక అనారోగ్యంతో వైద్యసేవలందుకుంటున్న వారికి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో సమస్యలు త్వరగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన మధ్యతరగతి, పేద కుటుంబాలవారు దరఖాస్తు చేసుకుంటే సాయం అందిస్తామన్నారు. కర్లపాలెంకు చెందిన బొమ్మిశెట్టి సాయికృష్ణకు రూ.4లక్షలు, బాపట్ల పట్టణం రైలుపేటకు చెందిన కరణం శైలజకు రూ.1.45లక్షలు, పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన నక్కాపాల్ దినేష్‌రెడ్డికి రూ.లక్షా30వేలు, కొత్రావారి వీధికి చెందిన తోట మురళికి రూ.1,04,178, వివేకానందకాలనీకి చెందిన బొమ్మిశెట్టి తాండవ కృష్ణకు రూ.లక్ష, ఇస్లాంపేటకు చెందిన ఇమ్మడిశెట్టి విష్ణుమూర్తికి రూ.86,085, విద్యానగర్‌కు చెందిన ఆవుల రమణమ్మకు రూ.85,290, ఎస్ఎన్‌పీ అగ్రహారానికి చెందిన పువ్వాడ వెంకటచలపతిరావుకు రూ.75వేలు, శీలంవారిపాలెంకు చెందిన కోడూరి మల్లేశ్వరికి రూ71,537, ఇమ్మడిశెట్టివారిపాలెంకు చెందిన దొప్పలపూడి చెంచు సుబ్బారావుకు రూ.70 వేలు, ఎస్ఎన్‌పి అగ్రహారానికి చెందిన రాయుడు నరేష్‌కుమార్‌కు రూ.68వేలు, భావపురినగర్‌కు చెందిన వి.సాయిమణికంటకు రూ59,739, రైలుపేటకు చెందిన వాకా వెంకటస్వామికి రూ.55వేలు, జమేదారుపేటకు చెందిన షేక్.సుల్తానాకు రూ.53,752, చిల్లరగొల్లపాలెంకు చెందిన ఆవుల వెంకటేశ్వర్లుకు రూ.53,721, శృంగారపురంనకు చెందిన వడ్లమూడి కోటేశ్వరమ్మకు రూ.50,700, ఇస్లాంపేటకు చెంది షేక్.అయాన్‌కు రూ.49,258, ఇస్లాంపేటకు చెందిన షేక్.సబీర్‌కు రూ.48,877, వివేకానందకాలనీకి చెందిన నీలి కృష్ణకుమార్‌కు రూ.47,628, చిల్లరగొల్లపాలెంకు చెందిన గవిని పార్వతికి రూ.45,350, పట్టణానికి చెందిన పుట్టా సుబ్బారెడ్డి రూ43వేలు, హయ్యర్‌నగర్‌కు చెందిన పాముల మౌనికకు రూ.35వేలు, 32వవార్డుకు చెందిన సలగల రిత్విక్‌రోషన్‌కు రూ.26,702, 33వ వార్డుకు చెందిన భోగిరెడ్డి సుదేష్ణకు రూ.25,166, భీమావారిపాలెంకు చెందిన తిరుమలశెట్టి చంద్రశేఖర్‌కు రూ.25,100. జమేదారుపేటకు చెందిన షేక్.అబ్దుల్ రహమాన్‌కు రూ.25వేలు, ఇమ్మడిశెట్టిపాలెంకు చెందిన షేక్.అబ్దుల్‌ఖాదర్‌జిలానీకి రూ.10వేలు చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

- సూర్యఘర్ యోజన ప్రతినిధి విజయభాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యఘర్ యోజన ప్రతినిధి విజయభాస్కర్

రేపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌వినియోగంలో అధికభారం తగ్గించుకునేందుకు కేంద్ర, రాష్ట్రాలు ప్రవేశపెట్టిన సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని సూర్యఘర్‌యోజన ప్రతినిధి విజయభాస్కర్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో సూర్యఘర్‌యోజనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో నియోజకవర్గంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవటం వల్ల విద్యుత్‌బిల్లులు ఆదా చేయవచ్చని తెలిపారు. ఈ పథకంలో రూ.75వేలు సబ్సిడీ వస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని అన్నారు. వెనకబడిన తరగతుల వారికి ప్రత్యేకరాయితీ ఉందని తెలిపారు. ముందుగా ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన పనిలేదని మా ప్రతినిధులే మీఇళ్ళకు వచ్చి సంబంధిత పత్రాలు తీసుకుని సోలార్‌సిస్టాన్ని బిగిస్తారని తెలిపారు. ఆరునెలల తర్వాత నుంచి నెలకు రూ.1355లు ఈఎంఐగా కట్టాలని తెలిపారు. సోలార్‌సిస్టమ్ ద్వారా నెలకు 450 యూనిట్లు వచ్చే పరిస్థితి ఉందన్నారు. గృహాలకు సోలార్ సిస్టమ్ ద్వారా వచ్చే మిగులు యూనిట్లు విద్యుత్‌శాఖకు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, మేకా రామకృష్ణ, నర్రా సుబ్బయ్య, దివి రాంబాబు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, సూర్యరాజు, అంకసుబ్బారావు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం

- విక్రయించినా.. వినియోగించినా.. చర్యలు
- మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉందని వ్యాపారులు విక్రయించినా.. ప్రజలు వినియోగించినా.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం పలు దుకాణాల్లో శానిటరి సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కొన్ని దుకాణాల్లో నిల్వ ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ముందుగా తెలియపరిచినప్పటికి గోదాముల్లో ప్లాస్టిక్ ఉంచి విక్రయించటం సరికాదని హెచ్చరించారు. పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భావన్నారాయణస్వామి సమీపంలోని బొడ్డుపల్లివారి వీధి నందు తనిఖీలు నిర్వహించి 90కిలోల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు, వ్యాపారులకు అనేకసార్లు అవగాహన కల్పిస్తున్నప్పటికీ విచ్చలవిడిగా విక్రయాలు జరపటం, వినియోగించటం దారుణమన్నారు. ఇదేవిధంగా అతిక్రమించి విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధించి గుడ్డసంచులు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా బెల్లంకొండ సురేష్



బాధ్యతలు స్వీకరించిన పీఏసీఎస్ అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్‌ను అభినందిస్తున్న నాయకులు

నగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి గొల్లపాలెం సహకారసంఘం సొసైటీ అధ్యక్షుడిగా బెల్లంకొండ సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్తానన్నారు. రైతులు సహాయ సహకారాలతో వారి సూచనలతో కలిసిమెలిసి అభివృద్ధి చేస్తానన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆశయాల మేరకు పనిచేసి ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధ్యక్షుడు సెక్రటరీ కలిసి సొసైటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలన్నారు. రైతులు బ్లాకులో ఎరువుల కొనలేకపోతున్నారని సొసైటీల ద్వారా రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులోకి తేవాలని సూచించారు. మాజీ జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన బెల్లంకొండ సురేష్ రైతులకు కావలసిన రుణాలు అందించి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గోపరాజు ఉదయ్‌కృష్ణ, మైనార్టీ సెల్ షేక్‌మునాఫ్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు చేసుకోండి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు(కొల్లూరు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. భట్టిప్రోలు గ్రామ సచివాలయంలో ఇళ్ల స్థలాల దరఖాస్తులు వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. అర్హులైన వారు తమ ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ దరఖాస్తు ఫారాలతో లిఖిత పూర్వక అర్జీ తీసుకుని సచివాలయ సిబ్బందిని కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పేదలకు దరఖాస్తు ప్రక్రియలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇళ్ల స్థలం మంజూరు సమయంలో లబ్ధిదారులు ఎవరికి ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామని అందుకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సాయిబాబా సూచించారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌కు మొక్కలు అందజేసిన జనసైనికులు



స్కూల్‌కు మొక్కలు అందజేస్తున్న జనసేనపార్టీ కార్యదర్శి గుంటుపల్లి తులసికుమారి, విన్నకోట సురేష్ తదితరులు

కర్లపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం పేరలి గ్రామంలోని మోడల్ ఫౌండేషన్ స్కూల్ టేబుల్స్, భోజన ప్లేట్స్, నోట్ పుస్తకాలు, పర్యావరణం కాపాడుకోవటానికి మొక్కలను అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు విన్నికోట సురేష్ సహకారంతో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి చేతుల మీదగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల జనసేనపార్టీ అధ్యక్షుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్లనియోజకవర్గ జనసైనికులు పసుపులేటి మహేష్, విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు గౌడ్, అంకిరెడ్డి అనూష్, కోకి రాజశేఖర్‌రెడ్డి, సంగీత ఏసోబు, సాయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలి

- పట్టణ సీఐ రాంబాబు

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : శక్తియాప్‌ను ప్రతిఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని పట్టణ సీఐ ఆర్ రాంబాబు తెలిపారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో ఎస్ఆర్ఐ కాలేజి నందు సోమవారం శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల శక్తిసబ్‌డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐ రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని శక్తియాప్‌ను ఎలా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులతో సంభాషించి యాప్ ద్వారా విద్యార్థులచే శక్తిటెస్ట్‌కాల్స్ చూపించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. యాంటీడ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొట్రా వెంకటరామకృష్ణ



వెంకటరామకృష్ణ

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారతీయజనతా పార్టీ జిల్లా కమిటీని అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు సోమవారం ప్రకటించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కొట్రా వెంకటరామకృష్ణ (బాపట్ల) కాకర్ల వెంకటేశ్వరరావు (చీరాల), పర్చూరి శ్రీనివాసరావు (అద్దంకి), ఉపాధ్యక్షుడిగా మంచళ్ళ లక్ష్మీ సుబ్రహ్మణ్యం (అద్దంకి), ఇనగండ్ల వెంకటేశ్వర్లు (పర్చూరు), మేడికొండ భరణిరావు (చీరాల), మామిడి రమేష్‌కుమార్ (బాపట్ల), కొలగాని సునీత (రేపల్లె), గుంజి ధనలక్ష్మీ (అద్దంకి రూరల్), కార్యదర్శులుగా అడపాల లక్ష్మీరాజ్యం (పర్చూరు), ప్రగడ సూర్యకుమారి (చీరాల), అంగడి నాగలక్ష్మీ (బాపట్ల), కేవీ శివరామకోటేశ్వరరావు (రేపల్లె), కోశాధికారిగా బూర్లె రత్తయ్య (బాపట్ల), ఐటీ సెల్ అండ్ ఆఫీస్ ఇన్‌చార్జి కే ఫణేంద్రకుమార్ (అద్దంకి) జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మోర్ల వెంకటకృష్ణప్రసాద్ (రేపల్లె)లను నియమించినట్లు తెలిపారు. 16మందితో ఏర్పడిన ఈకమిటీ బాధ్యతలు వెంటనే అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ కమిటీ ఏర్పాటుకు తోడ్పాటునందించిన నాయకులు, అభిమానులకు బంగారుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు కేటగిరి బీ, సీ సర్టిఫికెట్లు




ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ టీఈజీకే మూర్తి

బాపట్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఎన్‌సీసీ విద్యార్థులు కేటగిరి బీ, సీ సర్టిఫికెట్లు పొందారని బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. 14మంది కేటగిరి బి సర్టిఫికెట్స్, 15మంది కేటగిరి సీ సర్టిఫికెట్‌లను అందుకున్నారని ఏఎన్‌వో సీహెచ్ సుష్మా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ పాల్గొని ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు సర్టిఫికెట్‌లను అందజేశారు. సర్టిఫికెట్స్ అందుకున్నవారిని ఆదర్శంగా తీసుకొని మిగతవారు కూడా క్రమశిక్షణతో మెలిగి ఎన్‌సీసీలో కేటగిరి బీ, సీ సర్టిఫికెట్స్ పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సర్టిఫికెట్ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను అభినందించారు.

పాడిరైతులకు అండగా ఉంటాం

- సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్



ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ తదితరులు

నగరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ - రేపల్లె ఏరియా పాలరైతుల సంక్షేమానికి సంగం డెయిరీ కృషి చేస్తుందని డైరెక్టర్ నర్రా వెంకటకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రేపల్లె ఏరియా బీఎంసీల పరిధిలో ప్రొడ్యూసర్ వెల్ఫేర్ స్కీముల్లో సభ్యులుగా ఉండి అనారోగ్యంతో మృతి చెందిన పాలరైతు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చెక్కులను దూళిపూడిలో సంగం డెయిరీ డైరెక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. డెత్ రీలిఫ్ పథకం కింద(డీఆర్ఎఫ్) కమ్మవారిపాలెం పాలకేంద్రం అధ్యక్షుడు చదలవాడ వెంకట సుబ్బారావు నామినీ అయిన చదలవాడ శివధనలక్ష్మీకి రూ.1,33,249ల చెక్కును అందజేశారు. ఉల్లిపాలెం కేంద్రానికి చెందిన కొడాలి వెంకటశివరామకృష్ణ వేతన కార్యదర్శిగా చేస్తూ చనిపోగా ఆయన నామిని కొడాలి విజయలక్ష్మీకి రూ.1,31,988ల చెక్కును అందజేశారు. అలాగే సంగండెయిరీకి పాలుపోస్తూ డీవీసీ ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ స్కీము సభ్యులుగా ఉండి అనారోగ్యంతో మృతి చెందిన రేపల్లె ఏరియా పరిధిలోని పెనుమూడి కేంద్రానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు వంపుగళ్ల రూబెన్ నామిని కృపాభాగ్యలతకు రూ.50వేలు కొలగాని వారిపాలెం కేంద్రానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు కొలగాని సాయిబాబు నామిని పద్మకు రూ.50వేలు తాడివాకవారిపాలెం కేంద్రానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు తాడివాక సాంబయ్య నామిని హరిప్రసాద్‌కు రూ.50వేలు, బేతపూడి-ఏ కేంద్రానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు యేమినేని భాస్కరరావు నామిని యేమినేని మంగాదేవికి రూ.50వేలు కె.ధనలక్ష్మీ వెండర్ పాయింట్‌కు చెందిన కేసన ధనలక్ష్మీ నామిని కేసన బసవపూర్ణయ్యకు రూ.50వేలు చెక్కును అందజేశారు. రెండు పాలకేంద్రాల్లో అధ్యక్షుడిగా, వేతన కార్యదర్శిగా పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2,65,237లు చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ఐదు పాల కేంద్రాలకు చెందిన ఆరుగురు పాల ఉత్పత్తిదారులు అనారోగ్యంతో మృతి చెందగా వారి నామినీలకు మొ త్తంగా రూ.2,50,000ల చెక్కులను పంపిణీ చేశారు.

మొత్తంగా రూ.5,15,237ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నర్రావెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన రైతులు, ఉద్యోగుల కుటుంబాలకు సంగం డెయిరీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ వీరేంద్ర, ఫీల్డ్‌కోఆర్డినేటర్ ఎ.నవీన్‌గౌడ్, బీఎంసీ ఇన్‌చార్జీలు ఎం హరికృష్ణ, సజ్జా ప్రవీణ్, ఎండీ ఇస్మాయేల్, సూపర్‌వైజర్లు వాకా చెన్నకేశవరావు, డీ గోపీచంద్, ఎ.వేణుగోపి, బి.గోపి, జేవైవీ గోపాలకృష్ణ, కె.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు(చుండూరు), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లేఖ రాశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేయించి సంబంధించిన చెక్కును నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు తమ్మా శివారెడ్డి పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రాష్ట్ర సర్పంచుల సంక్షేమం సంఘం నాయకులు

బాపట్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పదిహేనో ఆర్థిక సంఘ నిధులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక గ్రామ పంచాయతీలు నిధులు లేక వేసవి కాలంలో ఇబ్బందిపడి మరలా వర్షాకాలం ప్రారంభం కావటంతో పారిశుధ్య పనులు, సైడ్‌కాల్వల పూడికతీత, బ్లీచింగ్ తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయనిచో ఆందోళనబాట పడుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిష్కారవేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలి



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని డివిజన్‌లోని ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మౌంట్‌ఫోర్టు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డులో చెత్తను తగలబెట్టటం వల్ల పాఠశాల నందు చదువుతున్న చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని.. విచారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు రక్షణ కిట్స్ పంపిణీ



కార్మికులకు రక్షణ కిట్స్ పంపిణీ చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు, ఎంపీపీ మోహనరావు

వేమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ శాఖ ద్వారా ఉచితంగా సరఫరా చేసిన వ్యక్తిగత రక్షణ కిట్స్‌ను సోమవారం మండలంలోని 17 గ్రామాల పంచాయితీల కార్మికులకు పంపిణీ చేశారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ అధ్యక్షత వహించారు. హాజరైన బాపట్ల పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, ఎంపీపీ మోహనరావులు 44 మంది కార్మికులకు మాస్కులు, బూట్లు, హెల్మెట్లు, జాకెట్స్, బ్లౌజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ, కూటమి కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలలో వారిని భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రధాన భూమిక వహించే కార్మికులకు తగిన విధంగా ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా గౌరవాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి శేఖర్, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పైనే శ్రద్ధ..!

● రసాయనాలు లేకుండా పండ్లు, కూరగాయల సాగు ● ఇంటికి సరిపడా ఆహారంతో పాటు.. శారీరక శ్రమ ● గ్రూపులుగా.. 250కి పైగా టెర్రస్ గార్డెన్స్

తెనాలి పట్టణంలో విస్తరిస్తున్న మిద్దె తోటలు



కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న పట్టణాల్లో ఇళ్ల దగ్గర కాస్తంత స్థలం కూడా కానరావడం లేదు. ఉన్న స్థలమంతా ఇంటి నిర్మాణానికే సరిపోతోంది. ఇక మొక్కలకు చోటు ఎక్కడుందని దిగులు పడేవారికి మిద్దె తోటలు దారి చూపుతున్నాయి. తెనాలి పట్టణంలో దాబాలపై గార్డెన్లు పెంచే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మిద్దె తోటలను 250 మందికి పైగా పెంచుతున్నారు.



టెర్రస్ గార్డెన్‌లో పెంచుకుంటున్న వివిధ రకాల మొక్కలు

తెనాలి అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దాబాలపై కుండీలు పెట్టి వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఇంటిలోకి కావాల్సిన కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్లు సమకూర్చుకుంటున్నారు. సేంద్రియ ఎరువుతోనే వీటిని పెంచుతూ.. శారీరక శ్రమ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

గ్రూపులుగా ఏర్పడి..

హైదరాబాద్‌లో 2015లో ప్రారంభమైన మిద్దె తోటల సాగు క్రమేణా అన్ని ప్రాంతాలకు విస్తరించింది. తెనాలి పట్టణంలోని రామలింగేశ్వర పేటకు చెందిన సూర్యదేవర కృష్ణదేవ్, మరికొంత మంది మిద్దె తోటలకు శ్రీకారం చుట్టారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ పేరిట గ్రూపులు ఏర్పాటు చేసుకుని.. ఒకరి అనుభవాలను మరొకరు పంచుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో చాలామంది ఏ పని లేకపోవడంతో మిద్దె తోటల పెంపకంపై దృష్టి సారించారు. పట్టణంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో మిద్దె తోటలు పెంచే వారందరూ గ్రూపులుగా ఏర్పడ్డారు. సుమారు 80 వేల మంది టెర్రస్ గార్డెన్ సాగు చేస్తున్నారు. ఆక్సిజన్ అధికంగా అందించే స్నేక్ ప్లాంట్, అగ్లోనిమా, పీస్ లిల్లీ, జెడ్ వంటి మొక్కలు, రెండేళ్లలో కాపునకు వచ్చే పండ్ల మొక్కలు జామ, మామిడి, చెరకు, అంజురా, బార్బడో, సపోటా, ఇంటికి రోజు సరిపడా ఆకు కూరలు, బెండ, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు సాగు చేస్తున్నారు.



మిద్దె తోటలో మొక్కలతో సూర్యదేవర కృష్ణదేవ్

రసాయనాలు లేకుండా..

మొక్కలను అంటుకట్టి వివిధ రకాల పద్ధతుల్లో నూతన మొక్కలను కూడా గ్రాఫ్టింగ్ చేస్తున్నారు. వీటికి వచ్చే తెగుళ్లను రసాయనిక మందులతో కాకుండా ఇళ్లలో ఉండే మజ్జిగ, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, పసుపుతో చేసిన ద్రావణాలు పిచికారీ చేసి తెగుళ్లు, పురుగులను అరికడుతున్నారు. రోజు గంట పాటు కేటాయించి శారీరక శ్రమ పొందుతున్న వీరికి మరో వ్యాయామం పని లేకుండా ఆరోగ్యం లభిస్తుంది. మొక్కల్లో మొదట వచ్చిన కాపును విత్తనాలుగా తీసి మరికొందరికి ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతిరోజు వారి ఇళ్లల్లో దిగుబడి వచ్చిన కూరగాయలు, ఆకు కూరలను వాట్సాప్ గ్రూపుల్లో ఇస్తున్నారు. ఇటీవల కడప పట్టణంలో మిద్దె తోటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పరిశీలించి అన్ని ప్రాంతాల్లో ప్రోత్సహించాలని సూచించారు. మనం తినే ఆహారం అత్యంత నాణ్యంగా.. మన ఇంటిపైనే పండించుకోవచ్చని మిద్దె తోటల పెంపకందారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో

పలు రైళ్ల రద్దు

● కొన్ని పాక్షిక రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి - దుగ్గిరాల - తెనాలి - చుండూరు రైల్వే సెక్షన్‌లో మూడో రైలుమార్గం ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులు కారణంగా ఈ నెలలో వారం, వచ్చే నెలలో రెండు వారాల పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 23 నుంచి 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67213 విజయవాడ - తెనాలి, 67214 తెనాలి - విజయవాడ, ఈ నెల 28, 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67229 విజయవాడ - గుంటూరు, 67223 గుంటూరు - రేపల్లె, 67224 రేపల్లె - తెనాలి, 67222 తెనాలి - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం తెలిపారు. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67221 విజయవాడ - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67232 రేపల్లె - తెనాలి, 67233 తెనాలి - రేపల్లె, 67234 రేపల్లె - గుంటూరు, 67235 గుంటూరు - తెనాలి, 67237 తెనాలి - రేపల్లె రద్దు చేశామన్నారు. ఆగస్టు 9 నుంచి 25వ తేదీ వరకు 67238 రేపల్లె - మార్కాపురం, 67239 మార్కాపురం - తెనాలి, 67236 తెనాలి - గుంటూరు, 67230 గుంటూరు - విజయవాడ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు 67249 గుంటూరు రేపల్లె, 67250 రేపల్లె - గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

రెండు రోజుల పాటు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆగస్టు 17, 18 తేదీల్లో నంబరు. 12733 తిరుపతి - లింగంపల్లి, ఆగస్టు 18, 19 తేదీల్లో 12734 లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశామన్నారు. అలానే నంబరు. 22708 తిరుపతి - విశాఖపట్టణం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13, 15, 17, నంబరు. 22707 విశాఖపట్టణం - తిరుపతి డబుల్ డెక్కర్‌ని ఆగస్టు 14, 16, 18 తేదీల్లో రద్దు చేశామన్నారు.

రేపల్లె, డెల్టా ఎక్స్‌ప్రెస్‌ల పాక్షిక రద్దు

నంబరు. 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 11 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు వరకే నడిపి గుంటూరు - రేపల్లె మధ్యన రద్దు చేస్తున్నారు. ఈ కారణంగా నంబరు. 17626 రేపల్లె - వికారాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి వికారాబాద్‌కు బయలుదేరుతుంది. అలానే నంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ మధ్యన రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి బయలుదేరుతుంది. నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు వరకే ప్రయాణించి ఆగిపోతుందన్నారు.

51 రైళ్లు న్యూగుంటూరు మీదగా మళ్లింపు

విజయవాడ - తెనాలి మార్గంలో ప్రయాణించే 51 రైళ్లను న్యూగుంటూరు రైల్వేస్టేషన్ మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. కృష్ణాకెనాల్ - న్యూగుంటూరు మీదగా తెనాలికి మళ్లించి అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో నడుపుతామన్నారు. అలానే చెన్నై వైపు నుంచి వచ్చే రైళ్లను తెనాలి నుంచి న్యూగుంటూరు, కృష్ణాకెనాల్ మీదగా విజయవాడకు మళ్లిస్తామన్నారు.

వందేభారత్, జన్మభూమి మంగళగిరి మీదగా మళ్లింపు

నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి, నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 9 నుంచి 19వ తేదీ మధ్యన మంగళగిరి మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో పేర్కొన్నారు. నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్, నంబరు. 20701 సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 17, 18 తేదీల్లో మంగళగిరి మార్గంలో మళ్లిస్తామన్నారు. రంబకె, 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్‌ని తెనాలి నుంచి విజయవాడ, కాజీపేట, పగిడిపల్లి మీదగా సికింద్రాబాద్‌కు మళ్లిస్తామన్నారు. ఆగస్టు 18వ తేదీన నంబరు. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి నుంచి కాజీపేట, విజయవాడ, తెనాలి మీదగా దారి మళ్లించి నడుపుతామన్నారు. నంబరు. 16032 కాత్రా - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 16న విజయవాడ - తెనాలి మీదగా, నంబరు. 16031 చెన్నై సెంట్రల్ - కాత్రా రైలుని ఆగస్టు 17న తెనాలి - విజయవాడ మీదగా మళ్లిస్తామన్నారు. నంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ, నంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13 నుంచి 18వ తేదీ వరకు న్యూగుంటూరు మీదగా కాకుండా కృష్ణా కెనాల్ నుంచి నేరుగా తెనాలి మార్గంలో నడపడం జరుగుతుందన్నారు. నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి చెన్నై ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 17, 18, 19 తేదీల్లో, నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 18, 19, 20 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 07193 హైదరాబాద్ - కొల్లం స్పెషల్ రైలుని ఆగస్టు 9, 16, నంబరు. 07194 కొల్లం - హైద రాబాద్ స్పెషల్‌ని ఆగస్టు 11, 18 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో అండమాన్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 19వ తేదీన 180 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

కలుషితమవుతున్న సముద్ర జలాలు

మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు

కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు

పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు

కడలి గర్భశోకం





లంకెవానిదిబ్బ సముద్రసమీపంలో మృత్యువాతపడ్డ తాబేలు

రేపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. దీంతో జీవరాశులు అంతరించి పోవడమేగాక తీర ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలగడంతో తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయి. రేపల్లె మండలంలోని లంకెవానిదిబ్బ, ఏలిచెట్లదిబ్బ తీర ప్రాంతాలకు మృతి చెందిన తాబేళ్లు, డాల్ఫి న్స్ కొట్టుకురావడంలో ఆందోళన కలిగిస్తోంది.

వ్యర్థాలతో అనర్థం..

ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలను సముద్రం లోకి వదిలేయడంతో జలాలు కలుషితమై.. జీవరాశులు చనిపోతున్నాయి. సముద్ర జలా లు, పర్యావరణాన్ని పరిరక్షించే అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నది, సముద్రం కలిసే ప్రాంతం కావడంతో ఎక్కు వగా డాల్ఫిన్‌లు ఉన్నాయి. సుమారు రెండు టన్నుల బరువు ఉండే డాల్ఫిన్ చేపలు మృతి చెంది ఒడ్డుకు వస్తున్నాయి. వీటిని వేటను మత్స్యశాఖ నిషేధించింది. కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో కేర్న్ ఇండియా, రిలయన్స్ సంస్థలు ఆయిల్ కోసం తవ్వకాలు జరుపుతున్నాయి. దీంతో క్రూడ్ ఆయిల్ తెట్టలు తెట్టలుగా సముంద్రంలో కలుస్తోంది. దీంతో సముద్ర జలాలు కలుషితమై చేపలు, తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



లంకెవానిదిబ్బ సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చిన మృతిచెందిన డాల్ఫిన్

తాబేళ్లతో సముద్ర జలాల శుద్ధి

ఆలివ్‌రెడ్‌లే తాబేళ్లు పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్ర జీవులకు ఉపకారం చేస్తాయి. సముద్రంలో ఆక్సిజన్‌ను పెంచేందుకు దోహద పడతాయి.

- అడ్డదిడ్డంగా ఉన్న నాచును తినడం వల్ల.. నాచు ఒక బెడ్‌లా ఏర్పడుతుంది. సముద్రం లోని జీవరాశులు ఈ బెడ్‌లో గుడ్లు పెట్టి సంతాన ఉత్పత్తిని పెంచుకునేందుకు ఉపయోగపడుతుంది.
- తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒక రకమైన జల్ విడుదల చేస్తాయి. ఆ జల్ భూమిలో బంకలా అతుక్కుపోయి తీర ప్రాంతం కోతలకు గురి కాకుండా నివారణకు ఉపయోగపడుతుంది. ఒక్కో తాబేలు మూడు నుంచి ఐదు కేజీల జెల్ వస్తుంది.
- తక్కువగా శ్వాస తీసుకోవడం వల్ల ఆలివ్‌రెడ్‌లే తాబేళ్లు 300 నుంచి 400 సంవత్సరాల వరకు జీవించగలుగుతాయి. సముద్ర జలాలు శుద్ధి చేయడం వల్ల తీర ప్రాంతంలో నివశించే ప్రజలు గాలిపాటుకు అంటువ్యాధుల బారిన పడకుండా ఉపయోగపడుతుంది.
- తాబేళ్లను చంపినా, గుడ్లను తిన్నా భారత వన్యప్రాణి చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు.

అమ్మ, నాన్న.. ఓ నకిలీ దత్త పుత్రిక!

● ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో ఆస్తి కొట్టేసే ప్రయత్నం? ● రెవెన్యూ అధికారులకు బాధితుడి ఫిర్యాదు



తెనాలి తహసీల్దార్‌కు తన ఆవేదనను వివరిస్తున్న బాధితుడు ఉమామహేశ్వరరావు

తెనాలి, జూలై 21, (ఆంధ్రజ్యోతి): సంతానం లేకపోయినా.. ఆయన ఆస్తికి వారసురాలిని చేశారు. తన భార్య కానీ, తాను కాని ఎవరినీ దత్తత తీసుకోపోయినా.. తమకు ఓ దత్తత కుమార్తె ఉందని రెవెన్యూ అధికారులు ధ్రువపత్రం సృష్టించారని.. తన యావదాస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇచ్చేశారని ఓ వ్యక్తి సోమవారం రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు.. గుంటూరు కలెక్టర్‌లో తెనాలి తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారు చెప్పిన మేరకు.. చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన నన్నపనేని లక్ష్మీ నాగేంద్రం అనే మహిళను వెలగా ఉమామహేశ్వరరావు 1991లో రెండో వివాహం చేసుకున్నారు. అదే గ్రామంలో కలసి ఉంటున్నారు. లక్ష్మీ నాగేంద్రం 2021లో మరణించారు. వారికి సంతానం లేరు. ఆమె చనిపోయాక ఒక మహిళ తన భార్య మొదటి భర్త ఉన్న సమయంలో ఆమెను దత్తత తీసుకున్నారని.. నకిలీ ధృవపత్రాన్ని సృష్టించిందని బాధితుడు వాపోయాడు. దాని ద్వారా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబం ఉండేది చేబ్రోలు మండలంలో అయితే.. తెనాలిలో ఎందుకు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ ఇచ్చారని ప్రశ్నను లేవనెత్తారు. పైగా సర్టిఫికెట్‌లో తన పేరును అసలు ప్రస్తావించకుండా.. ఆమె ఒక్కరి పేరుపై సర్టిఫికెట్ ఎలా ఇస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న మహిళ.. ఆమెతో ముందే బేరం మాట్లాడుకుని సర్టిఫికెట్ పొందారనే అనుమానం వ్యక్తం చేశారు. లేకపోతే వేజండ్లకు చెందిన కుటుంబానికి.. తెనాలిలో ఏ విచారణ లేకుండా సర్టిఫికెట్ ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. తన ఆధార్, తన భార్య ఆధార్ వేజెండ్ల అడ్రస్‌లోనే ఉన్నాయని, అన్ని ఆధారాలు చేబ్రోలు మండలంలో ఉంటే, తెనాలిలో ఇచ్చిన సర్టిఫికెట్ ఎట్లా చెల్లుబాటవుతుందనేది అతని సందేహం. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని, అప్పటి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు రూ.లక్షల్లో లంచం ముట్టిందనే ఆరోపణలు చేశారు. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని కోరారు. దత్తత పేరుతో కొందరు తన భార్య ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ వివరణ కోరగా.. ఇటీవలే కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన పెట్టుకున్న అర్జీ వచ్చిందని, మరోసారి తమ కార్యాలయంలోనూ అందించారని తెలిపారు. దీనిపై ఇప్పటికే విచారణ చేస్తున్నామని, త్వరలో విచారించి అసలు విషయం తేలుస్తామన్నారు.

పదిమందికి ఎస్ఐలుగా..

ఉద్యోగోన్నతి

● జిల్లాలు కేటాయిస్తూ ఐజీ ఆదేశాలు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో పది మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి జిల్లాలు కూడా కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఎస్.రవికుమార్, కె.సుభాషిని, ఎస్.చంద్రలీల, షేక్ యాస్మిన్, ఎల్.చిరంజీవి, ఎం అంజిరెడ్డి తదితరులను గుంటూరు జిల్లాకు కేటాయించారు. ఎల్.లక్ష్మీరాజ్యం, జి వాణిశ్రీని బాపట్ల జిల్లాకు, డి.దస్తగిరి, ఎస్.నాగేశ్వరరావును పల్నాడు జిల్లాకు కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు సోమవారం రేంజ్ ఐజీ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగోన్నతి పొందడం అంటే బాధ్యత పెరిగినట్లుగా భావించాలన్నారు. ఇకనుంచి మరింత బాధ్యతగా అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



ఐజీ త్రిపాఠిని కలిసిన ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు

సాంస్కృతిక వికాసానికి

పునరంకితం కావాలి

సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతికళాకారుడు సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలని సినీ రంగ స్థల నటులు, దర్శకులు కేఎస్‌టీ సాయి పిలుపునిచ్చారు. పట్టణంలోని జీఎస్ఎన్ టవర్స్ నందు సోమవారం బాపట్ల జిల్లా రచయితల సంఘం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సాయి మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఉభయ తెలుగురాష్ట్రాలకే తలమానికమైన బాపట్ల సాంస్కృతిక రంగ పునర్ వైభవానికి కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులకు జన్మనివ్వటమేకాక పలువురికి ప్రేరణ ఇచ్చి వారిని ఉత్తమకళాకారులుగా తీర్చిదిద్దిన రంగస్థల కళాశాలగా బాపట్లకు దేశ,విదేశాలలో చిరస్మరణీయమైన పేరు ఉందన్నారు. యువకళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుదీర్ఘమైన తన రంగస్థల అనుభవాలను కళాకారులతో ఆయన పంచుకున్నారు. కార్యక్రమానికి రచయిత తిమ్మర శ్యామ్‌సుందర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పెనుమెత్స నాగరాజు, గుండ్రెడ్డి సత్యనారాయణ, ఆకురాతి మురళీకృష్ణ, అంబటి మురళీకృష్ణ, నందిరాజు విజయ్‌కుమార్, సీతారాం, కళ్ళంహరినాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, బురుగుల సంగమేశ్వరశాస్త్రి,జీ శాంతారాం, డబ్ల్యుఏజికె.మూర్తి, షేక్.బాబావలి తదితరులు పాల్గొని బాపట్లకు చెందిన సాహిత్య, సామాజిక సంస్థలు గురించి వివరించారు.అనంతరం కేఎస్‌టీ సాయిని ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్‌టీ సాయి

సమగ్ర భూసార రక్షణ ఎంతో ముఖ్యం

కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు, 21 జూలై(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సమగ్ర భూసార సంరక్షణ ఎంతో ముఖ్యమని గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఇందుకు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా యన్నారు. జీవన ఎరువుల వాడకం, నిరంతరం ఆదాయం వచ్చే పంటల విధానం, వరి ఏ గ్రేడ్ నమూ నాలపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్ల ను జిల్లా కలెక్టర్, జేసీ ఎ.భార్గవ్ తేజతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మంది రంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకు మారి, డీఆర్వో ఎస్.ఎస్.కే.స్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ పొడి రూపంలో లభ్యమవుతున్న జీవన ఎరువుల కన్నా ద్రవ రూపంలో జీవన ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉండి.. మెరుగ్గా పనిచేస్తాయన్నారు. జీవన ఎరువులు లాంఫాంలోని ఏరువాక కేంద్రం, అమరావతిలోని జీవన ఎరువుల పరిశోధన కేంద్రంలో లభ్యమవుతాయని తెలిపారు. జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జీవన ఎరువులు వాడకంపై వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

గడువిస్తేనే..బీమా!

(5వ పేజీ తరువాయి)

పత్తి ఎకరాకు రూ.1,900 ప్రిమియం ఈ నెల 31వ తేదీ కల్లా చెల్లించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు బీమా పొగించడంతో పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు సూచించారు.

సాగు మొదలు కాని కంది, మిరప

కంది, మిరప పంటలు సాగు చేయలేదు. ఆయా పంటల సాగుపై రైతులకు ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెల మొదటి వారంలో సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయనున్నారు. పల్నాడులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సాగు చేపట్టలేదని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వర్షాలు కొనసాగితే కంది సాగు ఈ నెలాఖరుకు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. అగస్టు 15 తర్వాతే మిరప సాగు చేసే అవకాశాలున్నాయి. అయితే.. అప్పటి వరకు బీమా సౌకర్యం లేదు. పంటలు సాగు చేయక ముందే బీమా పథ కాల గడువు ముగుస్తుండటం గమనార్హం. జిల్లా యూనిట్ గా పంటల బీమాను అమలు చేస్తే పంటలు సాగు చేశాక రైతులు బీమా ప్రిమియం చెల్లించే అవకాశం ఉంటుంది. బీమా గడువును అగస్టు అఖరు వరకు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే బీమా సౌకర్యాన్ని వారు కోల్పోయినట్లే.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నా యని ఆయన అన్నారు. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెలాఖరునాటికి 90 శాతం మ్యాన్ పవర్‌తో పనులు జరిపిస్తామని ఆయన చెప్పారు.

● డిసెంబర్ నాటికి మెజారిటీ సంస్థల నిర్మాణాలు ప్రారంభం

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్ర బాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పిన ఆయన, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు.

చిన్న తరహా నీటి వనరుల గణన పూర్తి చేయాలి

అద్దంకి, జూలై21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల వారీగా చిన్న తరహా నీటి వనరుల గణన ఆగస్టు 10వ తేదీ లోపు పూర్తి చేయాలని బాపట్ల ఆర్‌డీవో కార్యాలయం డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ అన్నారు. అద్దంకి మండల వీఆర్‌వోలతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ మాట్లాడుతూ గ్రామాలలో చిన్ననీటి తరహా నీటి వనరులైన వ్యవసాయ బావులు, బోరుబావులు, నీటికుంటలు, చెరువుల గణన వేగవంతం చేయాలన్నారు. ముందు గా తహసీల్దార్ శ్రీచరణ్ తో చర్చించారు. కార్యక్రమంలో అద్దంకి, సంతమాగులూరు ఏఎస్ఓ లు అమర్నాథ్, ప్రసాద్, ఆర్‌ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

మార్టూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): మార్టూరులో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం నూతన కమిటి పాలక వర్గం ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేసింది. ఈ సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కమిటి సభ్యులు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. వారిలో అధ్యక్షుడిగా కనమర్ల పూడి సాంబశివరావు, సెక్రటరీగా కనమర్ల పూడి కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా మోదడుగు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా గుర్రం శ్రీనివాస రావు, శ్రీరం రవిశంకర్, చీకటి మర్ల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా గట్టా యానాదిరావు,కనమర్లపూడి నవీన్, మోదడుగు ప్రసాద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో స్థల దాత శ్రీరాం శేషగిరిరావు, కనమర్లపూడి అంజనేయులు, మద్దు హరిసీతారామయ్య, భోగనాథుని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



దేవస్థానం నూతన కమిటి పాలకవర్గం

జలజీవన్ మిషన్ పథకం పనులకు శంకుస్థాపన

యద్దనపూడి, (మార్టూరు) జూలై21 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం లోని పూనూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద ప్రభుత్వం నుంచి రూ.94 లక్షల నిదులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. వాటితో ఇంటింటికి మంచినీళ్ల పైప్ కనెక్షన్ ను ఏర్పాటుచేయడానికి, ఈ పథకం పనులకు సోమవారం గ్రామ టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బోయపాటి సాంబయ్య, ఈదల అనిల్‌కుమార్, దుగ్గినేని కోటేశ్వరరావు,వంకాయలపాటి వెంకటేశ్వర్లు,బడుగు కోటయ్య,కోడిరెక్క బాబు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

తాటివారిపాలెం ఉపసర్పంచ్ ఆత్మహత్య

మార్టూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటివారిపాలెం గ్రామ ఉపసర్పంచ్ తొట్టెంపూడి నరసయ్య (45) గడ్డిమందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. ఏఎస్సై భాషా కథనం మేరకు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మండలంలోని బొల్లాపల్లి రెవెన్యూ పరిధిలోని సాగర్ కాలువ వద్ద నరసయ్య మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని గురించి వివరాలను తెలియచేస్తూ, ట్రాక్టరు డ్రైవరుగా జీవనం సాగించే నరసయ్య, కొంత అప్పులు చేయగా, ఈ విషయమై భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకొంది. దాంతో గత మూడు రోజులు క్రితం భార్య రేణుక, కుమారుడు, కుమార్తెను తీసుకొని అద్దంకి మండలంలోని వెంపరాల గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరసయ్య గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వద్ద గడ్డిమందు సీసా ఉందని ఏఎస్సై భాషా తెలిపారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాషా తెలిపారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

అధికారులకు అంగన్వాడీల విజ్ఞప్తి



ఒంగోలులోని సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీల ఆందోళన

ఒంగోలునగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్రాల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని అంగన్వాడీలు సోమవారం జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోల కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఫేస్ యాప్‌ను తొలగించాలని, సెంటర్ నిర్వహణలో ఒక్క యాప్ మాత్రమే ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీడీపీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఒంగోలు రామ్‌నగర్‌లోని సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీవర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయటంలో సర్వర్‌లు సక్రమంగా పనిచేయకపోవటం, ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌లో పాతఫోన్లలో సక్రమంగా పనిచేయక పోవటం వలన ఇబ్బందులు పడుతున్నామని అంగన్వాడీలు తెలిపారు. బాలింతలు, గర్భిణి, చిన్న పిల్లలకు పౌష్టికాహారం పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్ ద్వారా ఈకేవైసీ చేసి, ఫొటో తీసి మాత్రమే సరుకులు ఇవ్వాలనే నిబంధన పెట్టటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● 'మీ కోసం'లో అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం



'మీ కోసం' కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దేశించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషు, ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, పార్థసారధి, కుమర్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

● భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు 30 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారంకావడం లేదని మార్కాపురం మండలం తిప్పాయపాలేనికి చెందిన దుగ్గిరెడ్డి మునిరెడ్డి అన్నారు. సమస్యను పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వహయంలో స్థానిక అధికార పార్టీ నేతల అండదండలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యను పరిష్కరిస్తారని ఆశించామని, అయినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తమ భూ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

● అక్రమణ దారుల నుంచి పశువుల మేత భూమిని కాపాడాలని పొదిలి మండలం నిమ్మవరం గ్రామానికి చెందిన గుదే నాగరాజు కోరారు. నిమ్మవరం గ్రామంలోని 8/4 సర్వేనెంబరులో 8.25 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత భూమి ఉందన్నారు. గ్రామానికి చెందిన నాసరయ్య అనే వ్యక్తి అక్రమణ చేసి పశువులకు మేత లేకుండా చేస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూమిని అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమాన్ని సస్యశ్యామలం చేస్తాం

● మంత్రి బాలవీరాంజనేయస్వామి



సంక్షేమ కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 21 (ఆంధ్ర జ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడికోట గ్రామంలో సోమవారం రాత్రి మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వెనుకబడిన ప్రకాశం జిల్లాకే కాకుండా రాయలసీమకు కూడా ఏమాత్రం న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలంగా చేసే లక్ష్యంతో పని చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. పింఛన్ పెంపు, తల్లివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో అన్నిరంగాల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, జూలై21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ, సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా అన్నారు. మండలంలోని మణికేశ్వరంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేతలు ఇంటింటికి పర్యటించారు. గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకుపోయారు. ఈ సమస్యపై మంత్రి రవికుమార్ ప్రత్యేకదృష్టి సారించి భూసేకరణ చేసి ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బడావలి, మీరావలి, ఈసు మౌలాలి, ఆదినారాయణ, మాథ్యూస్, సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మైలవరం రోడ్డుకు శంకుస్థాపన

మండలంలోని శాంతినగర్-మైలవరం రోడ్డు పూర్తిగా శిధిలావస్థకు చేరగా పునః నిర్మాణం కు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. ఈ తారు రోడ్డు నిర్మాణంకు మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉదయం 10-15 గంటలకు వెంపరాలలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు. సాయంత్రం 3-00 గంటలకు పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద గెస్ట్‌హౌస్‌లో జరిగే సంతమాగులూరు మండల క్లష్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్ ల సమావేశం లో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

బంగారం షాపులో గుమస్తా మోసం

ఎస్పీకి ఫిర్యాదు చేసిన యజమాని



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో గుమస్తా లెక్కలు సరిగా చూపలేదని ఒంగోలు కు చెందిన బంగారం షాపు యజమా ని ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమాల నుంచి 68 మంది ఎస్పీని నేరుగా కలిసి ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వా టిని సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా ద ర్శి మండలంలోని ఓ సచివాలయ ఉద్యోగి సబ్సిడీ కింది వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని రూ.3.80 లక్షలు తీసుకొని మోసం చేశాడని అద్దంకి మండలానికి చెందిన ఓ రైతు ఫిర్యాదు చేశారు. కుటుంబ అవసరాలకు ఓ మ హిళ రూ.1.50 లక్షలు తీసుకొని చెల్లని చెక్కులు ఇచ్చి మోసం చేయడమే కా కుండా డబ్బులు తిరగి ఇవ్వాలని అడుగుతుంటే బెదిరిస్తుందని ఒంగోలు నగరంలోని గోపాల్‌నగరం చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు దుర్గా ప్రసాద్, షమీముల్లా, పాండు రంగారావు, ఎస్సై జనార్ధనరావు పాల్గొన్నారు.

ఎస్పీకి డ్రోను కెమెరా అందజేత

శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు వినియోగించే డ్రోను కెమెరాను ఎస్పీ ఏఆర్ దామోదర్ కు పొదిలి మండలం కాటూరివారిపాలెంనకు చెదిన ఇరువురు అందజేశారు. మాకినేని వెంకటరమణయ్య, దంటు నరసింహారావులు కలిసి డ్రోన్ కెమెరాను కొనుగోలు చేసి ఎస్పీకి చేతులు మీదుగా పొదిలి ఎస్సైకి ఇచ్చారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ వారిద్దరునూ అభినందించారు. సమాజం పట్ల వారికి ఉన్న సేవా భావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై వేమన పాల్గొన్నారు.

సముద్రంలో పడి యువకుడు మృతి



చందు మృతదేహం

కొత్తపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సముద్ర స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయిన యువకుడు మృత్యువాతపడ్డాడు. వివరాల్లోకి వెళితే... టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన జలదంకి నాగచందు(19) ఆదివారం మండలంలోని మడనూరు సముద్ర తీరంలో స్నానం చేస్తూ అలలకు కొట్టుకుపోయాడు. చందు మృతదేహం సోమవారం మండలంలోని వజ్జిరెడ్డిపాలెం తీరానికి కొట్టుకువచ్చింది. స్థానికులు అందించిన సమాచారంతో కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వర్జీనియా పొగాకు రైతులకు విత్తనాలు

ఒంగోలు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారెన్ రైతులకు పొగాకు నారు విత్తనాలు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రంలో ఇస్తారని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2 నిర్వహణాధికారి జె.తులసి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బ్యారెన్ కు 500 గ్రాములు ఇస్తారని పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తప్పనిసరిగా బోర్డు నుంచి కొనుగోలు అనుమతి పత్రం పొందాలన్నారు. అదేవిధంగా పొగాకు నారు వ్యాపారం చేసే వారు కూడా పొగాకు బోర్డు నుంచి విత్తన కొనుగోలు అనుమతి పత్రం పొందాలని చెప్పారు. ఆ పత్రాలు పొందిన వారు కందుకూరు సీటీఆర్ఐ కేంద్రం నుంచి విత్తనాలు పొందాలని ఆమె కోరారు



మున్సిపల్ చైర్మన్ సాంబశివరావును సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

మన్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● చైర్మన్ సాంబశివరావు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌ను సోమవారం చీరాల రోటరీక్లబ్ ప్రతినిధులు సత్కరించారు. క్లబ్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ పారిశుధ్యం, డ్రెయిన్‌ల పూడికలపై ప్రత్యేకంగా వ్యవహరిస్తానని వివరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ మూర్తి, గోకుల్ కుమార్, కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, రామకృష్ణ, హేమంత్‌కుమార్, రాఘవరావు, శ్రీనివాసబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

14 బైక్‌లు స్వాధీనం

గుడివాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ.6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. సోమవారం ఒన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఏలూరు రోడ్డులో బైక్‌లను తనిఖీ చేస్తుండగా కొరడాల యేసు, చిలకంటి రంగారావులు అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించారని, వెంటనే పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా ఏలూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాలో 14 బైక్‌లను దొంగిలించినట్టు పేర్కొన్నారు. బైక్‌లను వేర్వేరు ప్రాంతాల్లో తాకట్టు పెట్టినట్టు తెలిపారు. ఆటో డ్రైవర్, తాపీ మేస్త్రీ ఇద్దరూ కలిసి ఆటస్థలాలు, ఆసుపత్రులు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగతనం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన పలువురు కానిస్టేబుళ్లకు రివార్డులను అందజేశారు.

మహిళా సమస్యలపై ప్రశ్నిస్తాం

● వైసీపీ ఎంపీ తనుజా రాణి

న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో మహిళా సమస్యలపై ప్రశ్నిస్తామని వైసీపీ ఎంపీ తనూజా రాణి తెలిపారు. ఆదివారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గురుమూర్తిలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం సరికాదన్నారు. ఏపీలో శాంతిభద్రతల అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తుతామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. మద్యం కుంభకోణం పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

నాణ్యత లేని బర్లీ పొగాకు బేళ్లను తేవొద్దు!

● రైతులకు మార్క్‌ఫెడ్ ఎండీ సూచన

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన బేళ్లను మాత్రమే రైతులు తీసుకురావాలని మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి ఎండీ డిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 'పొగాకు బేళ్లను తెచ్చే ముందు రోజు నాణ్యత తనిఖీ చేసుకోవాలి. తేమ 20 శాతంలోపు ఉంటేనే తీసుకురావాలి. అధిక తేమ, నల్ల బొగులు, పచ్చ బొగులు, పండుగుల్ల, బాగా డ్యామేజ్ అయిన బేళ్లను తీసుకొచ్చి, రైతుల శ్రమ, సమయాన్ని వృథా చేసుకోవద్దు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని పొగాకును తీసుకు వచ్చి, రైతులు ఇబ్బంది పడవద్దు. మార్క్‌ఫెడ్ సూచనలు పాటించాలి' అని ఆయన కోరారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు సెప్టెంబరు చివరి వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 18 కేంద్రాల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లు సాగుతున్నాయని, ఇప్పటికి 5,379 టన్నుల పొగాకును రూ.44కోట్లతో కొనుగోలు చేయగా, 2,196 మంది రైతులు లబ్ధి పొందారని డిల్లీరావు వివరించారు.

అవీ..ఇవీ..

కూటమి ప్రభుత్వం.. రైతు ప్రభుత్వం

● ఎమ్మెల్యే కొండయ్య



ఏఎంసీ చైర్మన్ జనార్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల, నిరుపేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్మన్‌గా కౌతవరపు జనార్ధన్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఆయనతో పాటు డైరక్టర్ల ప్రమాణ స్వీకారం చేయగా, ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతు సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను నిశితంగా వివరించి పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలి



చిన్నారులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆటలు, స్కూల్ సమయం ముగిశాక వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హైదరాబాదు హెల్పింగ్ సంస్థ ప్రతినిధులు సుషీల్, డా.లక్ష్మీ సింధూరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు అన్నివిధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవకాశాలు సద్వినియోగం చేసుకుని లక్ష్యాలు ఛేదించాలన్నారు. కార్యక్రమంలో మార్పు గ్రెగోరీ, ఫాదర్ లాజర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలపై వినతి

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ మించాల సాంబశివరావును స్థానికులు సర్విశెట్టి సుబ్బరామయ్య, మువ్వల శివప్రసాదరావు కోరారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందని, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని, 27వ వార్డులో హిందూశ్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ షాక్ తో గేదె మృతి



మృతిచెందిన గేదె

అద్దంకి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లిలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. మానం నరసింహారావు తన చూడి గేదెను ఆదివారం పొలం తోలుక పోయాడు. పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువైన గేదె మృతి చెందటంతో నరసింహారావు కన్నీటి పర్యంతమయ్యారు.

25 వరకు నల్లబర్లీ పొగాకు కొనుగోలు

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో నల్లబర్లీ పొగాకు ఉన్న రైతులు ఈ నెల 25 వ తేదీ వరకు సంతమాగులూరు మార్కెట్ యార్డు నందు కొనుగోలు చేస్తారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలో 109 మంది రైతుల వద్ద నల్ల బర్లీ పొగాకు ఉందని రైతులందరూ తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పొగాకును తీసుకెళ్లి అమ్ముకోవాలన్నారు. తేమశాతం 20 శాతం మించకుండా రైతులు చూసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలను పొగాకు రైతులు సంప్రదించాలని కోరారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పిన లారీ



జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడిన లోడులారీ

పంగులూరు, జూలై 21 (ఆంధ్ర జ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో లారీ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన సోమవారం తెల్లవారుఝామున చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమా చారం మేరకు చెన్నై నుంచి సోలార్ సామ గ్రితో హర్యానాకు వెళుతున్న లారీ మండలంలోని జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మార్టూరు, జూలై21(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గొట్టిపాటి నగర్ కాలనీకి సమీపంలోని చెట్లు వద్ద గుర్తు తెలియని యువకుడు(25) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు మద్యం సేవించి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అతను ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతుని ఆ చూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

ఆటో తగిలి ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఆటో తగలడంతో ద్విచక్రవాహనదారుడు రోడ్డుపై పడి గాయపడిన ఘటన సోమవారం మార్టూరులోని శ్రీచైతన్య స్కూల్ సమీపంలోని సర్వీసురోడ్డులో చోటుచేసుకొంది. పట్టణంలోని బలరాంకాలనీకి చెందిన బాపట్ల రాజు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పక్కనుంచి వెళుతున్న ఆటో తగిలింది. దీంతో అతను రోడ్డుపై పడిపడ్డాడు. దీంతో ముఖంపై గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది రాజును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాతనేరస్థులతో కొత్తసవాళ్లు



● నిఘా నుంచి తప్పుకోవడానికి వింతపోకడలు
● వీరికి సహకరిస్తున్న కొంతమంది సిబ్బంది
● స్వీయదాడులు చేసుకుంటూ పోలీసులపై నిందలు
● మరికొందరికి తప్పని ఉన్నతాధికారులు విచారణలు

చీరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పదే పదే నేరాల్లో కీలకంగా వ్యవహరిస్తూ, గంజాయి ఇతర అక్రమ రవాణా, నాటుసారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్, కేడీలుగా పోలీసులు కేసులు నమోదు చేస్తుంటారు. ఇలాంటి షీట్లు ఉన్న వారిపై నిరంతరం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. అయితే వీరి నుంచి తప్పించుకోవడానికి పోలీసులు వింతపోకడలు పోతున్నారు.

చీరాల వన్‌టౌన్‌లో 100 పాత నేరగాళ్లు ఉండగా, వీరిలో మహిళలు 10 మంది ఉన్నారు. అలాగే టూటౌన్ పరిధిలో 70 మంది నేరగాళ్లు ఉండగా వీరిలో 15 మంది మహిళలు, రూరల్ పరిధిలో 100 మంది ఉండగా వీరిలో మహిళలు 10 మంది, వేటపాలెంలో 50 మంది ఉన్నారు. వీళ్లల్లో ఎవరో ఒకరు ఏదో మూల నేరంలో పాల్పడి కేసుల్లో ఇరుక్కోవడం నిత్యకృత్యంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో చీరాల్లో ఒకవిధంగా నేరాల సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు.

దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా ఉంచింది. ఇప్పటికే వీరు ప్రతి శనివారం ఆయా స్టేషన్‌లో స్టేషన్ అధికారి వద్ద హాజరై దినచర్య వివరాలు అందచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా, ఏదైనా, కారణం చేత హాజరుకాకుంటే వారిపై నిఘా వ్యవస్థతో పాటు స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. తద్వారా వాస్తవ పరిణామాలను పోలీసులు తెలుసుకుంటారు. అయితే పోలీసులు నిత్యం నిఘా ఉంచుతుండడంతో నేరగాళ్ల ఆటలు సాగడం లేదని నేరస్థులు కొత్తఎత్తులు వేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే పోలీసుల కంటే కూడా నేరస్థులే చట్టాలపై అవగాహన పెంచుకొని వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఏకంగా బ్లేడ్లు, చాకులతో వ్యక్తిగత దాడులు చేసుకుని గాయాల బారిన పడి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. ఫలానా అధికారి వేధింపులే కారణం అని ఆ పోస్టుల సారాంశంగా ఉండడంతో అవాక్కవడం పోలీసులు వంతువుతోంది. ఇలాంటి నేపథ్యంలో అరెస్టులకు, విచారణలకు వెళ్లిన పోలీసులను కూడా భయాందోళనకు గురి చేస్తూ దాడులు చేస్తున్నారు. ఈక్రమంలో సాక్షాత్తు పోలీసులే తమ భద్రత కోసం బతుకు జీవుడా అంటూ అక్కడి నుంచి తప్పుకొని ఈ ఘటనతో తమకు సంబంధం లేదని ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

అంట కాగిన పోలీసులతో అనర్థమే

ఇదిలా ఉంటే నేరుగాళ్లతో కొందరు పోలీసులు అంటకాగుతున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడిక్కడే స్టేషన్లు మారుతూ నేరగాళ్లకు బాగా దగ్గరవుతున్నారు. పోలీసుల ప్రతి కదలికను నేరుస్థులకు అందిస్తూ మామూళ్లు దండుకుంటున్నారు. ఈ తరహా పోలీసులు దాదాపుగా అన్ని స్టేషన్‌లలోని, అన్ని విభాగాల్లో ఉన్నారనడంలో సందేహం లేదు. ఈ తరహా వారిపై దృష్టి సారించకుంటే నేరనియంత్రణ కష్టమేనని ప్రజలు భావిస్తున్నారు. ఎంతోకొంత పనిచేయాలనుకునే వారు మాత్రం నేరస్థుల తెలివితేటలకు భయపడి ఉద్యోగ భద్రతతో ఊగిసలాటలాడుతున్నారు.

పీడీ యాక్టులతోనే నియంత్రణ..!

ఏదో ఒక నేరంలో కేసులు నమోదు చేయడం 41 ఏ నోటీసులు అందించడం, లేదా అరకొర రిమాండ్‌లకు పంపడంతో సమస్యలకు పరిష్కారం ఉండదని, న్యాయ నిపుణులు చెబుతున్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై స్పష్టమైన నిఘా ఉంచాలి. అలాగే యాక్టీవ్ నేరస్థులపై పీడీ యాక్టులు నమోదు చేయాలి. ఈ విధమైన చర్యలతోనే నేరనియంత్రణ సులువుగా ఉంటుంది. ఈ తరహా ఆలోచనతో జిల్లా యంత్రాంగం పరిశీలించి శాంతి భద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి వనరుల వినియోగంపై సర్వే చేపట్టాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమలాకర్

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వ్యవసాయ బోరుబావుల నీటి వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయాలని జిల్లా డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ కమలాకర్ అన్నారు. సోమవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయంలో చిన్నతరహా నీటి వనరుల వినియోగంపై గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులు వినియోగిస్తున్న బోరు బావుల ద్వారా నీటిని ఎంతవరకు వినియోగిస్తున్నారు. వారి పంటలకు నీరు సరిపోతుందా లేక వృథా అవుతుందా..? అన్న వివరాలను రైతుల నుంచి తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని గ్రామాలలో రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ శిక్షణలో తహసీల్ధార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్ధార్ రవికుమార్ ఏఎస్‌వో ఆర్ అమరనాథ్, సంతమాగులూరు ఏఎస్‌వో ప్రసాదరావు, ఆర్‌ఐ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



అవగాహన కల్పిస్తున్న శక్తి టీం

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన అలవర్చుకోవాలని చీరాల శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్.హరిబాబు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు సోమవారం ఆయన శక్తి బృందం సభ్యులతో కలిసి సెలఫోన్ దుర్వినియోగం, గుడ్, బ్యాడ్‌టచ్‌లు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హరిబాబు మట్లాడుతూ మహిళల భద్రత విషయంలో శక్తియాప్ ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశ నుండే మహిళా చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాని ఎంచుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ. మోయిన్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్లను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలకు దూరంగా ఉండాలని అన్నారు. శక్తి యాప్ అంటే ఏమిటి, దానిని ఉపయోగాలు, బాల్య వివాహాల వలన కలిగే కష్ట, నష్టాలు, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినిమోగంతో వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్స్‌పాల్ ఎం.సుమాం జలి, శక్తిబృందం సభ్యులు సునీత ధనలక్ష్మి, చినగంజాం మహిళా కానిస్టేబుల్ కవిత,రాజు సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినులకు హార్మోన్లపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ విజయవర్ధన్

పంగులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):హార్మోన్ల లోపంతో సంక్రమించే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉపాస్ వైద్యశాల ఎండోక్రైనాలజి వెద్యనిపుణులు డాక్టర్ వి.విజయవర్దన్ అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హార్మోన్ల లోపంతో తలెత్తే వచ్చే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థినులు వ్యక్తం చేసిన అనుమానాలను నివృతి చేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కనాటుతున్న జనసేన నాయకులు

చినగంజాం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్. విజయలు అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు మండల జనసేన ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మొక్కలు నాటటమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అన్నారు. ప్రకృతి సమన్వయం కూడా మొక్కల పెంపకంపైనే ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో. జె.లక్ష్మీదేవి, వెలుగు సీసీ కె.వెంకటస్వామి, జనసేన నాయకులు చెరుకూరి లక్ష్మణరావు, బొప్పన శ్రీనివాసరావు, దొడ్డి పవన్, బి.సాయి, అంజి తదితరలు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



పర్చూరులో జలమయమైన వీధి

అద్దంకి, జూలై21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలు మెట్టపైర్లకు జీవం పోశాయి. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు అద్దంకి ప్రాంత రైతులు మొక్కజొన్న, నువ్వు తదితర మెట్ట పంటలు సాగు చేశారు. నెలరోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పైర్లలో ఎదుగుదల లేకుండా పోయింది. గత మూడు రోజులుగా వర్షాలు పడటంతో పాటు ఆదివారం అద్దంకిలో సుమారు 9.54 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఆదివారం కురిసిన వర్షంతో వాగులకు నీరు చేరింది. ఇప్పటికే సాగు చేసిన మెట్ట పంటలకు జీవం పోసినట్లయ్యింది. మిగిలిన పొలాలలో కూడా మొక్కజొన్నతో పాటు ఇతర పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. అదే సమయంలో బోరుబావుల కింద వరి నారు మడులు పోసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.



జీవం పోసుకున్న నూము పైరు

బల్లికురవలో కుండపోత వర్షం

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వారం రోజుల నుంచి ఎండల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భారీ వర్షం పడడం వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందారు. పంటల సాగుకు రైతులు భూములను దుక్కులు దున్ని సిద్ధం చేసి ఉన్నారు. వర్షంతో రెండు మూడు రోజుల్లో గ్రామాలలో పత్తి, సజ్జ, కంది పంటల సాగు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షం అని రైతులు పేర్కొంటున్నారు. పంట భూములు పదును అయ్యాయని వారు తెలిపారు. కొందరు రైతులు మొక్కజొన్న పంట సాగు చేసేందుకు సన్నాహాలలో ఉన్నారు. భారీ వర్షంతో బల్లికురవ మండల కేంద్రంలో రోడ్లన్ని జలమయం అయ్యాయి. రెండు గంటల పాటు కురిసిన వర్షంతో ఎక్కడ చూసిన వర్షపు నీరు కనిపించింది.

పర్చూరు : పర్చూరులో సోమవారం గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్డు జలమయం అయ్యాయి. విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా కాలనీలలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్ప డింది. స్థానిక బొమ్మల కూడలిలో గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. డ్రైనేజ్ కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. పర్చూరు - చీరాల రోడ్డులో వాగును తలపించేలా రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు చేరింది. ఇందిరా కాలనీ, అంబేద్కర్ నగర్, నెహ్రూకాలనీలలోని పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో రోడ్లు జలమయం అయ్యాయి.

నీరు పోలేదంటూ రోడ్డుకు కోత

● మూడు రోజులైన పట్టించుకోని అధికారులు
● అవస్థలు పడుతున్న ప్రజలు



చీరాల- వేటపాలెం మధ్య కోతకు గురైన రోడ్డు

సాల్మన్‌సెంటర్ (చీరాల), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాల్మన్ సెంటర్ వద్ద చీరాల - వేటపాలెం ప్రధాన రహదారిలో ఓ అపార్ట్‌మెంట్ అవసరాలకు సంబధించి సుమారు 15 అడుగుల రహదారిని అడ్డంగా కోత వేశారు. ఆ అపార్ట్‌మెంట్ వ్యర్థ జలాలు రోడ్డుకు అవతలి వైపు ఉన్న హైమా వైద్యశాల పక్కన ఉన్న మురుగనీటి కాలువలో కలిపేందుకు రోడ్డును కోశారు. ఈఘటన జరిగి మూడు రోజులు అవుతుంది. నేటికీ పూడ్చక పోవడంతో ఈ ప్రాంతంలో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడులో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పంగులూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగకు బేళ్లతో గోడౌన్లు నిండడంతో కొనుగోలు కేంద్రాన్ని తూర్పు కొప్పెరపాడుకు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రంలో సోమవారం 25 మంది రైతుల నుంచి 138 పొగాకుబేళ్లను కొనుగోలు చేసినట్లు పంగులూరు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. కొనుగోళ్ల ప్రారంభానికి ముందు తూర్పు కొప్పెరపాడులోని గోడౌన్‌ను తహసీల్దార్ సింగారావు, బయర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, లక్ష్మీదేవిలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, స్థానిక నేతలు పూనాటి రామాంజనేయులు, ఎనికపాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అరగుండు చేయించుకుని కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు అరగుండు చేయించుకొని తమ నిరసనను తెలియజేశారు. చాలిచాలని జీతాలతో కార్మికులు జీవనం కష్టంగా మారిందని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. గత తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, సామ్యూల్, వడివేలు, మారుతి, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న విస్తృత కళా పురస్కార సభ

అద్దంకిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆగస్టు 3న పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విస్తృత కళా పురస్కారం-2025 కార్యక్రమం డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో కవి, పురస్కార గ్రహీత శ్రీకృష్ణ సంపత్‌కుమార్‌కు ట్రస్ట్ తరఫున విస్తృత కళాపురస్కారం-2025ను అందించనున్నట్లు తెలిపారు. అందరు పాల్గొన్ని జయప్రదం చేయాలని శ్రీరామచంద్రమూర్తి కోరారు.

హెపటైటిస్ బీకి వ్యాక్సిన్

అద్దంకిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పసుమర్తిపాలెంలో హెల్ప్ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హెపటైటిస్ బీ, సీ పరీక్షలు నిర్వహించిన వారికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెపటైటిస్ బీ, సీ పరీక్షలలో నెగిటివ్ వచ్చిన వారికి ఇంటి వద్దనే ఏఎన్ఎం జె. రాధమ్మ వ్యాక్సిన్ వేసినట్లు సంస్థ ప్రతినిధి దుర్గ భవాని తెలిపారు. పరీక్షలలో పాజిటివ్ వచ్చిన వారికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పంపించి మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

బల్లికురవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బల్లికురవలోని జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో ఎకనామిక్స్ బోధించడానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ ద్వారా ఎకనమిక్స్‌లో పోస్టు గ్రాడ్యుమేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 24 వ తేదీలోగా పూర్తి బయెడేటాతో సంప్రదించాలన్నారు. అర్హత ఉన్న వారిని నియామకం చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు.